


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 58 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | మంగళవారం 4 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :58 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | TUE 4 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## వ్యక్తిగత పర్యటనలోనూ సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట...

## లండన్ లో వరుస సమావేశాలు

- లండన్ లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- పారిశ్రామిక దిగ్గజాలతో వరుసగా కీలక సమావేశాలు
- ఎనర్జీ, ఏవియేషన్, సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులే ప్రధాన అజెండా
- విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- రోల్స్ రాయిస్, ఆక్టోపస్ ఎనర్జీ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఫలవంతమైన చర్చలు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని వివరించి పెట్టుబడులకు పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్‌లో ఉన్నప్పటికీ, రాష్ట్రాభివృద్ధే ఏకైక అజెండాగా ముందుకు సాగుతున్నారు. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన అక్కడ పారిశ్రామిక దిగ్గజాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం నాడు లండన్‌లో పలు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో భేటీ అయిన ముఖ్యమంత్రి, నవ్యాంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను వారికి క్షుణ్ణంగా వివరించారు.

**విశాఖ సదస్సుకు ఆహ్వానం.. ఏపీ విధానాలపై ప్రశంసలు**

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'కు హాజరు కావాల్సిందిగా పారిశ్రామికవేత్తలను చంద్రబాబు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలను, పెట్టుబడిదారులకు అందిస్తున్న సహకారాన్ని ఆయన తెలియజేశారు.

వివరాలు 2లో..





## చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి

- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సును ఢీకొని, మీద పడిన కంకర లారీ
- ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతో పాటు మహిళలు, చిన్నారి
- ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు, ముగ్గురి పరిస్థితి విషమం
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన లారీ, బస్సుపై బోల్తా పడింది. లారీలోని కంకర మొత్తం ప్రయాణికులపై పడటంతో చాలామంది దాని కింద చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

వివరాలు 2లో..

## జోగి రమేశ్‌కు సహకరిస్తే పోలీసులపైనా చర్యలు



- కల్తీ మద్యం కేసులో జోగి రమేశ్‌ను ఆధారాలతోనే అరెస్ట్ చేశామన్న కొల్లు
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగానే నకిలీ మద్యం తయారీ చేశారని ఆరోపణ
- జోగి రమేశ్, జనార్దనరావు మధ్య సంబంధాలు బహిరంగమేనని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఏపీకి పెట్టుబడుల జాతర... రూ.9.8 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలకు రంగం సిద్ధం

- విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు
- రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా 410 ఒప్పందాలు
- రాష్ట్రంలో 7.5 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వ అంచనా
- ఇది ప్రజలు, ప్రభుత్వం, పరిశ్రమల మధ్య త్రైపాక్షిక భాగస్వామ్యం అన్న లోకేశ్
- సదస్సుకు హాజరుకానున్న కేంద్ర మంత్రులు, 45 దేశాల ప్రతినిధులు
- రూ.2.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

వివరాలు 2లో..




## కార్తీక మాసం రద్దీ: ఆలయాల్లో భద్రతపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

- పవిత్ర కార్తీక మాసం రద్దీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష
- కాకినాడ జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రతపై అధికారులకు ఆదేశాలు
- అన్నవరం, పిఠాపురం వంటి క్షేత్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచన
- కాశీబుగ్గ ఘటనను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టీకరణ
- క్యూ లైన్లు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్దేశం

వివరాలు 2లో..



## వరాలు ప్రకటించడానికి ముందు వాటికి సమాధానం చెప్పండి

### మోదీ, అమిత్ షాలకు ప్రియాంక గాంధీ ప్రశ్న



- సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ప్రియాంక గాంధీ
- ప్రధానమంత్రి అనవసర విషయాలు మాట్లాడుతున్నారని విమర్శ
- ఎన్డీయే ప్రభుత్వ అవినీతి, దుష్పరిపాలనపై మాట్లాడటం లేదని ఆగ్రహం

వివరాలు 2లో..

### జోగి రమేశ్ ను సస్పెండ్ చేయగలరా?:

## జగన్‌కు పట్టాభి సవాల్

- అన్ని ఆధారాలతోనే జోగి రమేశ్ ను అరెస్ట్ చేశారన్న పట్టాభి
- వివాదాన్ని పక్కదారి పట్టించేందుకే జగన్ కొత్త నాటకాలు అని విమర్శ
- జగన్ కుటుంబానికే నకిలీ మద్యం కమీషన్లు అని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**మాజీ ముఖ్యమంత్రి జగన్ పై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేశ్ ను వైసీపీ నుంచి సస్పెండ్ చేసే ధైర్యం జగన్‌కు ఉందా? అని ఆయన సవాల్ విసిరారు. ములకలచెరువు మద్యం కేసులో ఆరోపణలు రాగానే తమ పార్టీ నేత జయచంద్రారెడ్డిని టీడీపీ తక్షణమే సస్పెండ్ చేసిందని గుర్తుచేశారు. టీడీపీకి, వైసీపీకి మధ్య ఉన్న వ్యత్యాసం

వివరాలు 2లో..

### ఈ కక్ష సాధింపు నారా వారి

## కొత్త చట్టంలా మారింది



- కూటమి ప్రభుత్వం ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు పాల్పడుతోందన్న సజ్జల
- జోగి రమేశ్ అరెస్ట్‌తో ప్రభుత్వ వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయని మండిపాటు
- నకిలీ మద్యం కేసులో టీడీపీ నేత పాత్రపై ఆధారాలున్నాయని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'ప్రభుత్వం' అనే పదానికే అర్థం మారిపోయిందని, ప్రభుత్వమే వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతోందని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

వివరాలు 2లో..

### నా ముఖంపై గడ్డం, తలపై టోపీ ఉండటమే

## నన్ను 'తీవ్రవాది'గా చేసిందా?

- తనను తీవ్రవాది అన్నారంటూ తేజస్వి యాదవ్‌పై ఒవైసీ ఫైర్
- గడ్డం, టోపీ ఉంటే తీవ్రవాదినవుతానా అని తీవ్రస్థాయిలో ధ్వజం
- తేజస్వి మాట్లాడుతున్నది పాకిస్థాన్ భాష అని ఘాటు విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న కొద్దీ, రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంటోంది. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తనను "ఎక్స్ ట్రీమిస్ట్ (అతివాది)" అని సంబోధించారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# డయాబెటిస్ ఉన్నవారు నారింజ పండ్లు తినవచ్చు..

బీనారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చలికాలం సీజన్ లో ఇవి మనకు మార్కెట్‌లో ఎక్కువగా దర్శనమిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అత్యధిక మొత్తంలో లభించే పండ్లలో నారింజ పండు కూడా ఒకటి. నారింజ పండ్లను అనేక రకాలుగా తీసుకోవచ్చు. వీటిని నేరుగా అలాగే తినవచ్చు. లేదా జ్యూస్ చేసి తాగవచ్చు. ఇతర పండ్లతో కలిపి సలాడ్ రూపంలోనూ తినవచ్చు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి నారింజ పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. రోజూ కచ్చితంగా ఒక నారింజ పండును తినాలని, దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు సైతం సూచిస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు ఈ పండ్లను కచ్చితంగా రోజూ తినాలని వారు చెబుతున్నారు.

**విటమిన్ సి..**

నారింజ పండ్లలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి అధికంగా లభించే పండ్లలో నారింజ పండు ముందు వరుసలో నిలుస్తుంది. ఒక మీడియం సైజు నారింజ పండును తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. విటమిన్ సి వల్ల చర్మానికి సైతం ఎంతో మేలు జరుగుతుంది. ఇది శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు

**గుండె ఆరోగ్యానికి..**

నారింజ పండ్లను తినడం వల్ల విటమిన్ బి6 అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి నారింజ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. రోజూ ఒక నారింజ పండును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లను తింటుంటే కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నారింజ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**డయాబెటిస్ ఉన్నవారు కూడా..**

డయాబెటిస్ ఉన్నవారు సైతం నారింజ పండ్లను తినవచ్చు. ఇందులో భయం చెందాల్సిన పనిలేదు. నారింజ పండ్లను తింటే షుగర్ పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఇది అపోహే. ఇందులో నిజం లేదు. ఎందుకంటే నారింజ పండు గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ 40గా ఉంటుంది. అందువల్ల ఈ పండును తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా ఈ పండ్లను రోజూ తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. ఇక ఈ పండ్లలో సిట్రేట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కిడ్నీల్లో స్టోన్లు ఏర్పడకుండా చూస్తాయి. అందువల్ల కిడ్నీ స్టోన్లు ఉన్నవారికి మేలు జరుగుతుంది. అలాగే మూత్రం పీహెచ్ స్థాయిలు సరైన రీతిలో ఉంటాయి. దీని వల్ల మూత్రాశయం, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నారింజ పండును రోజుకు ఒకటి చొప్పున తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# వరాలు ప్రకటించడానికి ముందు వాటికి సమాధానం చెప్పండి

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీయే కూటమి వరాలు ప్రకటిస్తోందని, గత ఇరవై ఏళ్లలో ఏం చేశారో చెప్పాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలను ఏఐసీసీ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, ప్రధానమంత్రి అనవసర విషయాలన్నీ మాట్లాడుతున్నారని విమర్శించారు. బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అవినీతి, దుష్పరిపాలనపై మాత్రం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. దేశాన్ని, బీహార్‌ను అవమానించారని ప్రతిపక్ష నాయకులపై ప్రధాని ముద్ర వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంలో కొత్తగా 'అవమానాల మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని ఎద్దేవా చేశారు. అభివృద్ధి గురించి మాట్లాడకుండా దేశాన్ని, బీహార్‌ను అవమానిస్తున్నారని విమర్శలు చేయడమేమిటని అన్నారు. ఎన్నికలు ఉన్నాయనే కారణంతో వరాలు ప్రకటించడం కంటే ముందు ఇన్నేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీహార్ ప్రభుత్వాన్ని నితీశ్ కుమార్ నడపడం లేదని, ప్రధానమంత్రి, ఇతర వ్యక్తులు ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నారని అన్నారు. ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతోందని, వారికి ఉపాధి అవసరమని అన్నారు.

# జోగి రమేశ్‌కు సహకరిస్తే పోలీసులపైనా చర్యలు

కల్తీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేశ్‌ను పూర్తి ఆధారాలతోనే పోలీసులు అరెస్టు చేశారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగానే జోగి రమేశ్ నకిలీ మద్యం తయారు చేయించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కేసులో అన్ని ఆధారాలూ సేకరించిన తర్వాతే చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్‌కు, మరో నిందితుడైన జనార్ధనరావుకు మధ్య ఉన్న సంబంధం అందరికీ తెలిసిందేనని అన్నారు. జనార్ధనరావు నేరుగా జోగి రమేశ్ ఇంటికి వెళ్లినట్లు నిర్ధారించే సీసీటీవీ ఫుటేజ్ కూడా తమ వద్ద ఉందని ఆయన వెల్లడించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత జోగి రమేశ్‌కు ఏమాత్రం లేదని విమర్శించారు.

ఈ కేసు దర్యాప్తు విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని మంత్రి హెచ్చరించారు. ఒకవేళ పోలీసు శాఖలో ఎవరైనా అధికారులు ఉద్దేశపూర్వకంగా జోగి రమేశ్‌కు అనుకూలంగా వ్యవహరించినా, కేసును తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించినా వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుందని, దోషులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు.

# వ్యక్తిగత పర్యటనలోనూ సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట...

- మొదటి పేజి తరువాయి

"గతంలో ఉన్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్థానంలో తాము 'స్పీడ్ డూయింగ్ బిజినెస్' అనే నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను అత్యంత వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నామని" చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఆదాయంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు రెడ్ కార్పెట్ పరుస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా భవిష్యత్తును శాసించే గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్లు, ఏవియేషన్ వంటి కీలక రంగాలపై దృష్టి సారించాలని ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు.

**ఆక్టోపస్ ఎనర్జీతో ఇంధన రంగంపై చర్చలు**

ఈ సమావేశాల పరంపరలో భాగంగా, లండన్‌లోని అతిపెద్ద విద్యుత్ సరఫరాదారుగా పేరుగాంచిన ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్ గెరాల్డ్ తో సీఎం భేటీ అయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుందని తెలిపారు. అమరావతి, విశాఖపట్నం వంటి నగరాల్లో స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్, ఆధునిక టెక్నాలజీతో కూడిన విద్యుత్ సరఫరా, నియంత్రణ వంటి రంగాల్లో పనిచేసేందుకు ముందుకు రావాలని ఆక్టోపస్ ఎనర్జీని ఆహ్వానించారు. విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పాలసీలను వివరిస్తూ, విశాఖ సదస్సుకు పక్కా ప్రతిపాదనలతో రావాలని కోరారు.

**రోల్స్ రాయిస్‌తో ఏవియేషన్ రంగంపై దృష్టి**

అనంతరం, ఏరో ఇంజిన్లు, డీజిల్ ప్రొపల్షన్ సిస్టమ్స్ తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రోల్స్ రాయిస్ గ్రూప్ ప్రతినిధులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఆ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ) నిక్కీ గ్రేడీ స్మిత్‌తో చర్చలు జరిపారు. ఏపీలో ఏరోస్పేస్ కాంపోనెంట్స్ ఉత్పత్తికి అనువైన పారిశ్రామిక వాతావరణం ఉందని తెలిపారు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఉన్న మిలిటరీ ఎయిర్ స్ట్రిప్‌ను ప్రస్తావిస్తూ, అక్కడ విమానాల మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్ (ఎంఆర్ఓ) యూనిట్ ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు.

అలాగే, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఏవియేషన్ ఎకోసిస్టం, ఎంఆర్ఓ ఫెసిలిటీ ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను ప్రస్తావించారు. విశాఖ, తిరుపతిలలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని రోల్స్ రాయిస్ ప్రతినిధులను సీఎం కోరారు.

**సెమీకండక్టర్, బ్యాటరీ రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి**

ఈ పర్యటనలో భాగంగా ఎస్ఆర్ఏఎమ్ %డ% ఎమ్ఆర్ఏఎమ్ గ్రూప్ చైర్మన్ శైలేష్ హిరనందానీ, శామ్కో హోల్డింగ్ లిమిటెడ్ చైర్మన్ సంపత్ కుమార్ మల్లాయతో కూడా ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ చర్చల ఫలితంగా, రాష్ట్రంలో సెమీ కండక్టర్స్, అధునాతన ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుపై ఎస్ఆర్ఏఎమ్ %డ% ఎమ్ఆర్ఏఎమ్ గ్రూప్ ఆసక్తి కనబరిచింది. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కూడా సీఎం ఈ సంస్థల ప్రతినిధులకు వివరించారు. వ్యక్తిగత పర్యటనలో ఉన్నప్పటికీ, రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి దార్శనికతతో చేస్తున్న ఈ ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రితో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# కార్తీక మాసం రద్దీ: ఆలయాల్లో భద్రతపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

పవిత్ర కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో, కాకినాడ జిల్లా పరిధిలోని పుణ్యక్షేత్రాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. క్యూ లైన్ల నిర్వహణ, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ క్షేత్రం, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలకు కార్తీక మాసంలో భక్తులు భారీ సంఖ్యలో వస్తారని, ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "కాశీబుగ్గ ఘటనను దృష్టిలో ఉంచుకొని దేవాదాయ శాఖ ఆలయాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రాలతో పాటు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల జాబితాను కూడా సిద్ధం చేసి, వాటి వద్ద రద్దీని పర్యవేక్షించాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ నెల 5వ తేదీన కార్తీక పౌర్ణమి ఉన్నందున ఆ రోజు, ఆ తర్వాత రోజుల్లో రద్దీ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా శని, ఆది, సోమవారాల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా

దేవాదాయ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. "భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలి. ఆలయ పరిసరాలు, క్యూ లైన్ల వద్ద సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలి. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుధ్యాన్ని కాపాడాలి. రద్దీకి తగినట్లు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలి. ఆలయాల సమీపంలోని జాతీయ రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలి. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలి" అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఏపీకి పెట్టుబడుల జాతర... రూ.9.8 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలకు రంగం సిద్ధం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేస్తోంది. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్ఠాత్మక 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'ను నిర్వహించనుంది. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలోకి రూ.9.8 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, 7.5 లక్షల ఉద్యోగాలను సృష్టించే దిశగా కీలకమైన 410 అవగాహన ఒప్పందాలు (%వీశీఖ%లు) కుదరనున్నాయని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సదస్సు కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా.. ప్రజలు, ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థల మధ్య ఒక బలమైన త్రైపాక్షిక భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని స్పష్టం చేసింది.

ఈ సదస్సు వివరాలను ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ సదస్సు ఒక శుభారంభం (కర్టెన్ రైజర్) వంటిదని ఆయన అభివర్ణించారు. అభివృద్ధిని కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి విస్తరింపజేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి వచ్చే ప్రతి పెట్టుబడి, యువత సాధికారతకు దోహదపడాలన్నదే తమ ఆశయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, "వేగాన్ని కోరుకునే కంపెనీలు, ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటాయి" (%జశీఎజ్ఖుఅవవర్ ష్ఞ్ఖ ఎష్త్రశీశీంవ ఆజూవవస, ఎష్త్రశీశీంవ ూఅఎష్త్రతీఖు ూతీఖుఎవంష్త్ర%) అనే నినాదాన్ని ఆయన ఆవిష్కరించారు.

"ఈ సదస్సు మన ప్రజలు, మా ప్రభుత్వం, భవిష్యత్ ప్రణాళికలు కలిగిన కార్పొరేట్ సంస్థల మధ్య ఒక గొప్ప భాగస్వామ్యం. ఇక్కడ కుదిరే ప్రతి ఒప్పందం మన యువత కలలకు మేము ఇచ్చే హామీ. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం అంటే వేగాన్ని, నమ్మకాన్ని, అవకాశాన్ని ఎంచుకోవడమే. తెలుగు వారి ఆత్మగౌరవం పునాదిగా, ప్రపంచ స్థాయి నాయకత్వం కోసం నిర్మించిన వేదిక ఇది" అని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

సదస్సు ముఖ్యాంశాలు, ప్రముఖుల హాజరు

ఈ రెండు రోజుల సదస్సులో మొత్తం 48 సెషన్లు జరగనున్నాయి. ఇందులో ఒక ప్లీనరీ, 27 టెక్నికల్ సెషన్లు, 3 స్టాండలోన్ సెషన్లు, 11 రాష్ట్రాలకు సంబంధించిన ప్రత్యేక సెషన్లు ఉంటాయి. జీ20 సభ్య దేశాలతో సహా 45 దేశాల నుంచి 300 మంది విదేశీ ప్రతినిధులు, 72 మంది అంతర్జాతీయ వక్తలు పాల్గొననున్నారు. ఈ సదస్సు ప్రాధాన్యతను తెలియజేస్తూ, కేంద్ర ప్రభుత్వం నుంచి పలువురు కీలక మంత్రులు హాజరు కానున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి, సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) డా. జితేంద్ర సింగ్ వంటి ప్రముఖులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతు తెలపనున్నారు. అంతేకాకుండా, ఒప్పందాలతో పాటు రాష్ట్రంలో వికేంద్రీకృత అభివృద్ధిని బలపరుస్తూ, 2.5 లక్షల ఉద్యోగాలను సృష్టించే రూ.2.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు కూడా చేయనున్నారు.

**గత 16 నెలల ప్రగతి.. కంపెనీలు ఏపీని ఎందుకు ఎంచుకుంటున్నాయి?**

గత 16 నెలల్లో తమ ప్రభుత్వం సాధించిన పారిశ్రామిక ప్రగతిని లోకేశ్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.5 లక్షల కోట్లతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు కేవలం 14 నెలల్లోనే ఫాస్ట్-ట్రాక్ పద్ధతిలో అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు.

గూగుల్ సంస్థ విశాఖలో డేటా, ఏఐ హబ్ ఏర్పాటుకు సుమారు రూ.15 బిలియన్ల పెట్టుబడి పెట్టడం, బీపీసీఎల్ రిఫైనరీ విస్తరణకు రూ.1 లక్ష కోట్లు, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ కోసం రూ.1.65 లక్షల కోట్లు కేటాయించడం వంటివి రాష్ట్రంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. దేశంలోని టాప్-10 సోలార్ తయారీదారులలో ఐదు కంపెనీలు తమ కార్యకలాపాల విస్తరణకు ఏపీని ఎంచుకున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర ప్రభుత్వంతో నిర్మాణాత్మక భాగస్వామ్యం, సింగిల్ విండో విధానం ద్వారా ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం వంటి కారణాల వల్లే కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని లోకేశ్ విశ్లేషించారు. రాష్ట్రంలో ఉన్న నైపుణ్యం గల యువశక్తి టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలను ఆకర్షిస్తోందని, గ్లోబల్-గ్రేడ్ లాజిస్టిక్స్, నిరంతర విద్యుత్ సరఫరా, కనెక్టివిటీ వంటివి గూగుల్ వంటి టెక్ దిగ్గజాలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి కారణమయ్యాయని తెలిపారు.

## నా ముఖంపై గడ్డం, తలపై టోపీ ఉండటమే నన్ను 'తీవ్రవాది'గా చేసిందా?

- మొదటి పేజి తరువాయి

కిషన్‌గంజ్‌లో జరిగిన ఓ ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, తేజస్విపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఇంటర్వ్యూలో, ఒవైసీతో పొత్తు ఎందుకు పెట్టుకోలేదని తేజస్విని అడగ్గా.. "ఒవైసీ ఒక అతివాది, ఛాందసవాది... తీవ్రవాది" అని సమాధానమిచ్చారని అసదుద్దీన్ ఆరోపించారు. "నా ముఖంపై గడ్డం, తలపై టోపీ ఉండటమే నన్ను తీవ్రవాదిగా చేసిందా? నేను నా మతాన్ని గర్వంగా పాటిస్తున్నందుకే నన్ను ఇలా అంటారా? మీ తండ్రి (లాలూ ప్రసాద్ యాదవ్)కి భయపడని వాడిని, లొంగని వాడిని చూసి మీకు ఇంత ద్వేషమా?" అని ఒవైసీ ప్రశ్నించారు. తేజస్వి యాదవ్ పాకిస్థాన్ భాష మాట్లాడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఒవైసీ ప్రసంగం, తేజస్వి వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో క్లిప్‌ను ఎంఐఎం పార్టీ 'ఎక్స్'లో పంచుకుంది.

2025 బీహార్ ఎన్నికల కోసం మహాఘట్‌బంధన్‌తో సీట్ల సర్దుబాటుకు ఎంఐఎం ప్రయత్నించింది. దాదాపు ఆరు స్థానాలు ఆశించినప్పటికీ, ఆర్జేడీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఒవైసీ, తేజస్విపై విమర్శల దాడి పెంచారు. రాష్ట్రంలోని 243 స్థానాల్లో 100 స్థానాల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని, అవసరమైతే భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి 'థర్డ్ ఫ్రంట్' ఏర్పాటు చేస్తామని ఒవైసీ ప్రకటించారు. 2020 ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సీమాంచల్ ప్రాంతంలో 5 స్థానాలు గెలుచుకుంది. అయితే, గెలిచిన ఐదుగురిలో నలుగురు ఎమ్మెల్యేలు తర్వాత ఆర్జేడీలో చేరారు. బీహార్ జనాభాలో 17.7 శాతం ఉన్న ముస్లింలకు సరైన రాజకీయ నాయకత్వం లేదని, ఆ లోటును తాము భర్తీ చేస్తామని ఒవైసీ చెబుతున్నారు. ఆర్జేడీకి సాంప్రదాయంగా ఉన్న 'ముస్లిం-యాదవ్ (%వీ%)' ఓటు బ్యాంకును చీల్చడమే లక్ష్యంగా ఒవైసీ పావులు కదుపుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు ఎన్డీయే, మహాఘట్‌బంధన్ కూటములకు ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

## చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి, తిరిగి హైదరాబాద్‌లోని కార్యాలయాలు, కళాశాలలకు వెళ్తున్న వారే వీరిలో అధికంగా ఉన్నారు. ప్రయాణికుల ఆర్తనాదాలతో ప్రమాద స్థలం హృదయవిదారకంగా మారింది. మృతుల్లో బస్సు డ్రైవర్ దస్తగిరి, లారీ డ్రైవర్ సహా 12 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో కంకరను తొలగించి, అందులో చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు కండక్టర్ రాధ సహా 15 మందిని సురక్షితంగా కాపాడారు. ఈ క్రమంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కూడా గాయపడ్డారు.

క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్షతగాత్రులకు అత్యున్నత వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. మృతులందరి పోస్టుమార్టం ఉస్మానియా ఆసుపత్రిలో ఒకేచోట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

## జోగి రమేశ్ ను సస్పెండ్ చేయగలరా?: జగన్‌కు పట్టాభి సవాల్

- మొదటి పేజి తరువాయి

ఇదేనని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నకిలీ మద్యం కేసును పక్కదారి పట్టించేందుకే జగన్ కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. పక్కా ఆధారాలతోనే జోగి రమేశ్ ను అధికారులు అరెస్ట్ చేశారని, ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపు లేదని తెలిపారు. ఈ కేసులో నిందితులైన అద్దేపల్లి సోదరులతో జోగి రమేశ్ జరిపిన ఫోన్ సంభాషణలు, వాట్సాప్ చాటింగ్‌లు వాస్తవం కాదా? అని పట్టాభి నిలదీశారు. "నకిలీ మద్యం దందా ద్వారా వైసీపీ నేతలు కోట్లాది రూపాయలు దండుకున్నది నిజం కాదా? విదేశాల్లో నడిపిన దందాను ఇక్కడ కూడా అమలు చేయడానికి శిక్షణ ఇచ్చి, నకిలీ మద్యం తయారు చేయించింది వాస్తవం కాదా?" అని పట్టాభి ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మొత్తం వ్యవహారం జగన్ కుటుంబ సభ్యులకు కమీషన్లు ముట్టజెప్పడానికే సాగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. నైతిక విలువలు ఉంటే తక్షణమే జోగి రమేశ్ పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఈ కక్ష సాధింపు నారా వారి కొత్త చట్టంలా మారింది

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవస్థలను గాలికి వదిలేసి ప్రత్యర్థులపై కక్ష సాధింపులకు దిగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్ట్‌తో వీరి వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయని ఆయన విమర్శించారు.

నకిలీ మద్యం కేసు వ్యవహారంపై సజ్జల మాట్లాడుతూ, ఈ వ్యవహారంలో టీడీపీ నేత జయచంద్రారెడ్డి పాత్ర స్పష్టంగా కనిపిస్తోందని, అందుకు తగిన ఆధారాలున్నాయని తెలిపారు. జయచంద్రారెడ్డి మనుషులే నకిలీ మద్యం ఫ్యాక్టరీలు నడిపి, వారి షాపుల్లోనే అమ్ముతున్నారని ఆరోపించారు. ఆయనకు ఆఫ్రికాలో వ్యాపారాలు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్‌లోనూ స్పష్టంగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇంత స్పష్టంగా ఆధారాలున్నా, వాస్తవాలను పక్కనపెట్టి వైసీపీ నేతలపై నెపం మోపడానికి జోగి రమేశ్‌ను అసంబద్ధంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గ్రూపుల గొడవల్లో జరిగిన జంట హత్యల కేసును తమ పార్టీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై పెట్టారని అన్నారు. తునిలో మైనర్ బాలికపై టీడీపీ నేత అత్యాచారం చేస్తే, సంబంధం లేని వైసీపీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లకు పిలిచి వేధిస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియా కేసులో గంజాయి పెట్టి అరెస్ట్ చేస్తే హైకోర్టు కూడా ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో లోకేశ్ 'రెడ్ బుక్' పాలన నడుస్తోందని, ఆయన నేతృత్వంలో విధ్వంసకర పాలన సాగిస్తున్నారని సజ్జల విమర్శించారు. "ప్రతిపక్షం గొంతు వినిపించకూడదనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కేవలం వాంగ్మూలాల ఆధారంగా వైసీపీ నేతలను అరెస్ట్ చేసి జైళ్లలో పెడుతున్నారు. కక్ష సాధింపే 'నారా వారి కొత్త చట్టం'లా మారింది" అని ఆయన వ్యాఖ్యానించారు. జోగి రమేశ్ ఇంట్లో పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్కులు దొరికాయంటూ చట్టాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారని, నేరం చేయకపోయినా తమ నేతలు శిక్షకు గురవుతున్నారని అన్నారు. ఇన్ని జరుగుతున్నా రాష్ట్రంలో నకిలీ మద్యం అమ్మకాలు మాత్రం ఆగడం లేదని సజ్జల విమర్శించారు.

# శివాలయాల్లో కార్తీక శోభ..!





పెన్ పవర్ హుకుంపేట నవంబర్ 3 : కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో. శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి శివనామస్మరణతో భక్తులు పూజలు నిర్వహించారు కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో ఉదయాన్నే భక్తులు శివాలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలను ఆహ్లాదకరంగా అలంకరించి. శివలింగానికి పాలు నెయ్యి తేనె వంటి అభిషేకాలను భక్తులు నిర్వహించారు దీంతో శివాలయ ప్రాంగణం హర హర మహాదేవ అంటూ. శివ నామాలతో హోరెత్తించారు ఈ కార్యక్రమంలో హుకుంపేట గ్రామ ప్రజలు మరియు చుట్టుపక్కల గ్రామ ప్రజలు అధికంగా పాల్గొన్నారు

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# సచివాలయం 474, 475లో అక్రమ యుసిలు!





- బిల్డర్లతో కుమ్మక్కైన ప్లానింగ్ సెక్రటరీలు!
- అక్రమ, అదనపంతస్తుల నిర్మాణాలకు ప్లానింగ్ సెక్రెటరీ సపోర్ట్!
- జీవీఎంసీకి భారీ ఆదాయనష్టం!
- టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం!
- బాధ్యులపై చర్యలకు ప్రజల డిమాండ్!
- అధికారుల 'మౌనసమ్మతి'..?
- ఇంకా వెలుగులోకి రానున్న వివరాలు..

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 3 :** జీవీఎంసీ (గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలో అక్రమ నిర్మాణాల మాఫియా మరోసారి చెలరేగింది. ముఖ్యంగా జోన్-8, వేపగుంట జోనల్ కార్యాలయం పరిధి, జీవీఎంసీ 90 వ వార్డు, కాకానినగర్, బుచ్చిరాజుపాలెం, వార్డు సచివాలయాలు 474, 475 ప్రాంతాల్లో అక్రమ, అదనపంతస్తులు నిర్మాణాలు దర్జాగా జరిగిపోతున్నాయి. అనుమతులు లేకుండా బిల్డర్లు అదనపు అంతస్తులు కట్టిస్తుండగా, వార్డుల సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు కళ్లుమూసుకుని ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అక్రమ నిర్మాణాలకు సచివాలయం సపోర్ట్!

జీవీఎంసీ 90వ వార్డులోని రెండు బిల్డింగ్‌లలో అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు (పెంట్ హౌసులు) కట్టించడంలో సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు కీలకపాత్ర పోషిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ప్రతి బిల్డింగ్‌కూ లక్షల్లో ముడుపులు మారి, ప్లానింగ్ సెక్రటరీలు ప్లాస్టింగ్ లు, 'వైట్‌వాష్' వేయించారని తెలుస్తోంది.

## జీవీఎంసీకి భారీ ఆదాయనష్టం..

ఈ అక్రమ నిర్మాణాల వల్ల జీవీఎంసీకి భారీ ఆదాయ నష్టం జరుగుతోంది. బిల్డింగ్ అనుమతుల రూపంలో రావాల్సిన ఫీజులు, పన్నులు బిల్డర్లు తప్పించుకుంటున్నారని సమాచారం. టౌన్ ప్లానింగ్ విభాగం నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ చర్యలపై ఉన్నతాధికారులు మౌనం పాటించడం గమనార్హం.

## టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం..

స్థానిక ప్రజలు చెబుతున్నట్లుగా, జోన్ 8లో బిల్డింగ్ అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగుతున్నా, ఏసీపీ, టిపిఓ, డిసిపిలు చర్యలు తీసుకోవడం లేదు. కేవలం నోటీసుల ముసుగులో వ్యవహారం ముగుస్తుందని, వాస్తవ చర్యలు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ప్రజల డిమాండ్ - బాధ్యులపై చర్యలు

సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు ప్రియా, అప్పలస్వామిపై వెంటనే విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలకు సహకరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. "జీవీఎంసీ కమిషనర్ చెప్పే నిబంధనలు కేవలం కాగితాలపైనే ఉన్నాయా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## అధికారుల 'మౌనసమ్మతి'?..

పత్రికలలో వస్తున్న వార్తలపై అధికారుల స్పందన లేకపోవడం, వార్డు స్థాయి అధికారులకు మరింత ధైర్యం ఇస్తోందని స్థానికులు అంటున్నారు. ఒకవైపు జీవీఎంసీ నిబంధనలు ఉల్లంఘించబడుతుంటే, మరోవైపు బిల్డర్లు 'ప్లానింగ్ సెక్రటరీల దయతో' ఏకంగా అదనపు అంతస్తులు కట్టించుకుంటున్న వాస్తవాలు బయటపడుతున్నాయి.

## ఇంకా వెలుగులోకి రానున్న వివరాలు

ఈ రెండు బిల్డింగ్‌లతో పాటు జోన్-8లో మరిన్ని అక్రమ కట్టడాల వివరాలు త్వరలో వెలుగులోకి రానున్నాయని సమాచారం.

"జీవీఎంసీ నిబంధనలు ఉల్లంఘించే వారిని వదిలేస్తే, విశాఖ అభివృద్ధి ముఖచిత్రం దెబ్బతింటుంది" అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# శిధిల రేకుల షెడ్లోనే అంగన్వాడి విద్య!

**తీములగుంటకు శాశ్వత భవనం మంజూరు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 1:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని తీములగుంటలో అంగన్వాడి సేవలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. చిన్నారుల భవిష్యత్తు నిర్మాణానికి కేంద్రంగా ఉండాల్సిన అంగన్వాడి, ఇప్పుడు శిధిలమైన రేకుల షెడ్లో ఆవాసం కోసం పోతూ కనిపిస్తోంది.చీకటి, తడి నేల, చెదురుముదురు ఇండ్ల మధ్య చిన్నారులు మట్టి నేలపై కూర్చొని భోజనం చేయడం, పాఠాలు నేర్చుకోవడం వంటి దుస్థితి నెలకొంది. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిండిపిల్లలు ప్రభుత్వ సేవలు పొందే కేంద్రం ఇంత నిర్లక్ష్యంగా ఉండటంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ అంగన్వాడిలో ప్రీ-స్కూల్ చిన్నారులు 4 మంది, పిండిపిల్లలు 3 మంది, గర్భిణీలు 2 మంది, బాలింతలు 2 మంది, కిషోర బాలికలు 5 మంది అంగన్వాడి సేవలు పొందుతున్నారు. రేకుల షెడ్డు పక్కనే వంట చెరుకు గుట్టలు ఉండటంతో భద్రతా ప్రమాదం కూడా పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తగిన వెలుతురు లేకపోవడంతో అంగన్వాడి కార్యకర్తకే ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వారు తెలిపారు. వంచుల ప్రధాన అంగన్వాడికి వెళ్లాలంటే దట్టమైన అరణ్యం దాటాల్సి రావడం వల్ల చిన్నారులను తరలించడం కూడా చాలా కష్టంగా మారింది. గ్రామస్తులు గుంట ధనలక్ష్మి, గుంట లక్ష్మి, కిలో మనీ, గుంట చంద్రమ్మ, గుంట పద్మ, కోర్ర భానుమతి, కోర్ర బాలరాజు, కొర్ర శ్రీను, కిలో దొన్ను, వంతల భీమరాజు తదితరులు కలిసి జిల్లా అధికారులు, ఐసిడీఎస్ విభాగం వెంటనే స్పందించి తీములగుంట గ్రామానికి శాశ్వత అంగన్వాడి భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# "ఫిర్యాదులను తూతూమంత్రంగా కాకుండా సక్రమంగా పరిష్కరించాలి



## కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆదేశాలు

**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 03 :**జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీ ఆర్ఎస్ వ్యవస్థను మరింత సమర్థవం తంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారు లతో జిల్లా స్థాయి అధికారులు స్వయంగా మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకో వాలని, దిగువ స్థాయి సిబ్బంది ద్వారా స్పందించడం అనుమతించబోమని ఆయన స్పష్టంగా హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతి ఫిర్యాదుదారుతో నేరుగా సంభాషించటం ద్వారా సమస్యల అసలు మూలాన్ని అర్థం చేసుకుని, నాణ్యమైన పరిష్కారం చూపాలి. తూతూమంత్రంగా ఎండార్స్మెంట్ ఇవ్వడాన్ని సహించము," అని అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.అలాగే, గతంలో వచ్చిన ఫిర్యాదు లు, వాటిపై అధికారులు తీసుకున్న చర్యలు, అందించిన నివేదికలను సమీక్షించిన తర్వాత కలెక్టర్ తెలిపారు ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, స్పష్టత, సమర్థత అవసరమని. నిర్ణీత కాలవ్యవధిలో చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వారి ఫిర్యాదు పురోగతిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర శాఖల ప్రతినిధులు ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

413 వినతులు స్వీకరణ సోమవారం నిర్వ హించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 413 వినతులు స్వీకరించబడ్డాయి. వీటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 148, జీవీఎంసీకి చెందినవి 126, పోలీస్ శాఖకు 32, మరియు ఇతర శాఖలకు సంబంధించినవి 107గా గుర్తించారు.

కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఈ సందర్భంగా అన్నా రు ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని, వాటి పరిష్కారం పట్ల బాధ్యతగా వ్యవహరిం చాలి. ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత ఉండేలా చూడాలి, అని సూచించారు.



# హెల్మెట్ ఉంటేనే జిల్లాలోకి అనుమతి





- **జాతీయ రాష్ట్ర రహదారులపై సంతలు నివారించండి**
- **కౌమార బాలికల రాకపోకలపై సమాచారం సేకరించండి.**
- **జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్**

**పాడేరు,పెన్ పవర్ నవంబర్ 3:** ప్రమాదాలు నివారణకు పటిష్ట చర్యల్లో భాగంగా జిల్లాలోకి టూ వీలర్స్ వినియోగదారులు హెల్మెట్ ధరిస్తేనే జిల్లాలోకి అనుమతి ఉందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

సోమవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నందు రహదారుల భద్రతపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఉన్న ప్రతి చెక్క పోస్ట్ వద్ద హెల్మెట్ లేనిదే మరియు మద్యం సేవించి వాహనం నడుపుతున్న అనుమతించరాదని పోలీసులను ఆదేశించారు.

రద్దీ ఉన్న స్థలాల్లో జీప్స్, ఆటో రిక్షాలు పార్కింగ్ చేయరాదని వారికి కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చెయ్యలాగా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. జిల్లాలో స్థానికంగా ప్రయాణికులకు సరిపడే బస్సులు ఉన్నాయా అని ఆరా తీశారు. జిల్లాలో ఏ ఏ స్థానిక ప్రదేశాలలో ఆర్టీసీ బస్సు కొరత ఉందో దానిపై పూర్తిగా పరిశీలించి నివేదిక తయారు చేయమని ఆర్టీసీ మరియు ట్రాన్స్పోర్ట్ అధికారులకు ఆదేశించారు.

భారీ వాహనాలు 25 టన్స్ కంటే మించారాదని , పగలు సమయంలోను, వారాంతాలలో భారీ వాహనాలు కు అనుమతి లేదని తెలియజేశారు. రాబోయే రెండు మూడు నెలలు జిల్లాలోకి టూరిస్టు రాకపోకలు ఎక్కువ అవుతున్నందున మరింత భద్రతా చర్యలు పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జాతీయ మరియు రాష్ట్ర రహదారులపై నిర్వహిస్తున్న సంతలకు ప్రత్యామ్నంగా దగ్గరగా ఉన్న స్థలాలను కేటాయించి విను వెంటనే సంతలు ఆ స్థలాలకు మార్చడం జరిగేలాగా చూడాలని స్పష్టం చేశారు.

జాతీయ రహదారులపై బస్సు షెల్టర్స్ లో సోలార్ లైట్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు.

కౌమార దశలో ఉన్న బాలికల ఒకలు లేదా ఇద్దరు ముగ్గురు కలిసి ప్రయాణించిన వారికి సంబంధిత సేకరించాలని ఆర్టీసీ సిబ్బందికి, జీప్స్, ఆటో రిక్షా డ్రైవర్స్ కు ఆదేశించారు.

రహదారులకు అన్న అధికారంగా ఉన్న షాప్స్ ను వెనువెంటనే తొలగించాలని రహదారులు మరియు భవనాలు, పంచాయతీరాజ్, పోలీస్ శాఖను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్ని ప్రైవేటు వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని ఆరా తీశారు. ప్రజా వాహనంలో ప్రయాణం భద్రతతో ఉండాలని సూచించారు. ప్రతి వాహనం జిల్లాలో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని తెలిపారు. ప్రతి మద్య దుకాణం వద్ద పోలీసు నిఘా పెట్టి, మద్యం సేవించిన ఉన్న వారిపై జరిమానా జారీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ, డి.ఎస్.పి మొహమ్మద్ షహబాజ్, జిల్లా రహదారులు మరియు భవనాల అధికారి బాల సుందరం బాబు, జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాశ్రావు, అదనపు వైద్యాధికారి డాక్టర్ టీ ప్రతాప్, వైద్య కళాశాల ప్రిన్సిపల్, జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ డి హేమలత రాణి, పంచాయతీరాజ్ ఈ ఈ కొండయ్య పడాల్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి కె. చంద్రశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 03:**మొంథా తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలనే మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన నిత్యావసర సరుకులను విశాఖ తూర్పునియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు12 వ వార్డు నెహ్రూనగర్ లో గల రేషన్ డిపో నెంబర్ 221 ద్వారా ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం మరియు ఒక్కో కేజీ చొప్పున కందిపప్పు, పంచదార, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు అందజేశారు.ఈ కార్యక్రమం లో వార్డు ఇంచార్జి మరియు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, సత్యం,విశాఖ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు,ప్రధాన కార్యదర్శి పోతిన భరత్, గోపాల్,రేపాక భషవదేవుళ్ళు, రాగుల తిమోతి,రవి,బాల, రాపర్తి గణపతి,మల్లేశ్వర్రావు, బండారుశంకర్రావు,వీరు, మహిళా నాయకులు ఇల్లా లక్ష్మి,షారోని,మూడడ్ల రమ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రేడియాలజీ సదస్సులో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థుల కీర్తి పతాక



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 03 :**
గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రేడియాలజీ సదస్సులో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభాపాటవాలతో మెరిశారు. రెండు రోజుల పాటు సాగిన ఈ సదస్సులో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం నిర్వహించిన పరిశోధన పత్రాల మరియు ప్రదర్శనల విభాగాల్లో ఎ.ఎమ్.సి విద్యార్థులు పలు బహుమతులు కైవసం చేసుకున్నారు.
మొత్తం 180 పరిశోధన పత్రికలలో డా. జి. పుష్పిత అగ్రస్థానం సాధించి, ప్రతిష్టాత్మక వైజాగ్ సిటీ సబ్ చాప్టర్ అవార్డు మరియు బంగారు పతకాన్ని అందుకున్నారు. అదే విభాగంలో డా. జయగురు సంబతరాజన్ ద్వితీయ స్థానం సాధించి డా. రాజారెడ్డి గోల్డ్ మెడల్ను గెలుచు కున్నారు. అలాగే డా. మేఘన అడిగ విశేష ప్రతిభ కనబరిచి ప్రత్యేక ప్రశంస పత్రం అందుకున్నారు.
ఈ విజయాలపై కళాశాల ప్రిన్సిపాల్ డా. సంధ్యాదేవి, కింగ్ జార్జ్ ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డా. వాణి, రేడియాలజీ విభాగాధిపతి డా. బుజ్జి బాబు, ఆచార్యులు డా. ఉమా మహే శ్వరరావు తదితరులు విద్యార్థులను అభినం దించారు. విద్యార్థుల ప్రతిభ రేడియాలజీ విభాగానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

## మత్స్య గుండం లో పోలీసుల నడుమ కార్తీక శోభ..

* పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసిన సి ఐ సన్యాసి నాయుడు మరియు ఎస్ఐ సూర్యనారాయ



**పెన్ పవర్ హుకుంపేట. నవంబర్ 03:** కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లా ఎస్పీ అదేశాల మేరకు ప్రముఖ శివాలయ క్షేత్రం మత్స్య గుండం లో పటిష్ట భద్రత కల్పిస్తున్నామని హుకుంపేట సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ సూర్య నారాయణ అన్నారు, సోమవారం మత్స్య లింగేశ్వరా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, వారికీ ఆలయ అర్చకులు స్వామి తీర్ధ ప్రసాదాలు అందజేశారు, దేవాలయానికి వచ్చే భక్తుల ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా రద్ది దృష్ట్యా ఐదు గురు సివిల్ కానిస్టేబుల్లు, ఇద్దరు సచివాలయం మహిళ పోలీస్ లను దేవాలయం వద్ద ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు, ఎటువంటి అవాంఛనీయ చర్యలు జరగకుండా ఉండేటట్టు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, సూర్య నారాయణ నాయుడు,మత్స్య కొండ బాబు, గోపాల పాత్రుడు, రామ్ బాబు నాయుడు, బాలయ్య అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కోరుకొండ హరే రామ ఆలయంలో అన్నదానం..

నెలరోజులు భారీ అన్నదానం..



**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్ 3:** మండల కేంద్రమైన కోరుకొండ హరే రామ ఆలయం వద్ద కార్తీక మాసం నెల రోజులు భారీ అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమానికి కోరుకొండ చుట్టుపక్కల నలుమూలల నుండి భక్తులు, స్వాములు భారీగా ఆలయ వద్ద అన్నదానం స్వీకరించారు.

# పిపిపి విధానంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు



* ఎ.ఎం.సి చైర్మన్ గవిరెడ్డి రమణ

**నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 03) :**ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డ్ ఆవరణలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ తెలిపారు. సోమవారం ఉదయం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డ్ కార్యాలయంలో వైస్ చైర్మన్ చిటికెల కన్నంనాయుడు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి భువనేశ్వరి లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం 2025 - 26 సంవత్సరానికి గాను 16 రకాల వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. దీనికి సంబంధించిన వివరాలను అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ వివరాలపై అవగాహన చేసుకుని సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచనల మేరకు మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న గోడౌన్లు, దుకాణాల మరమ్మతులకు గాను 43 లక్షలు, ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన గోడౌను బాగు చేసేందుకు మరో 14 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. వీటికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. రైతు బజార్లు పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తేవడానికి, కోటవురట్ల మార్గంలో ఉన్న మార్కెట్ యార్డ్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి 94 లక్షల అవసరమని బోర్డు మీటింగ్లో తీర్మానం చేసి స్పీకర్ కు అందజేశామన్నారు. ఆయన ఈ నిధులు మంజూరుకు కృషి చేస్తున్నారని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మార్కెట్ యార్డ్ ఆవరణలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. సిబ్బందితో కలిసి నియోజకవర్గంలోని మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని అన్నారు. సిబ్బంది పనితీరును, పన్ను చెల్లించకుండా తరలిపోతున్న వ్యవసాయ ఉత్పత్తులను నియంత్రించడం జరిగిందన్నారు. ఒక్క అక్టోబర్ లోనే చెక్ పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీల ద్వారా రూ.1,28,000 లు పన్ను వసూలు చేయడం జరిగిందన్నారు.ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి నేటి వరకు ఆకస్మిక తనిఖీలు ద్వారా సుమారు 15 లక్షల రూపాయలు పన్ను వసూలు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రోజుకు రూ.2500 లు మించి వ్యవసాయ ఉత్పత్తులపై వ్యాపారం చేసే వారు తప్పక ట్రేడ్ లైసెన్స్ పొందాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఇప్పటికే వ్యాపారస్తులతో పలు సమావేశాలు నిర్వహించామన్నారు. ఇలాంటి 31 మంది వ్యాపారస్తులను గుర్తించామని, వీరందరినీ లైసెన్సులు పొందాలని సూచించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజా వైద్యం ప్రజల హక్కు

భీమిలి నియోజకవర్గంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సీపీ విస్తృత కార్యక్రమం






**భీమిలి, పెన్ పవర్, నవంబర్ 03 :**మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ప్రజా వైద్యం ప్రజల హక్కు పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవే టీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమం భీమిలి నియోజకవ ర్గంలో ఉత్సాహంగా సాగింది.పద్మనాభం మం డల వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ఈ సంత కాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్సీపీ మం డల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ నగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివా సరావు చిన్న శ్రీను హాజరై పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం ప్రజల ప్రాథమిక హక్కు. ప్రజల ఆరోగ్యంపై వ్యాపార ధోరణులు ప్రబలకుండా వైఎస్ఆర్సీపీ పోరాటం చేస్తుంది. వైద్య విద్య అందరికీ అందు బాటులో ఉండాలనే దీక్షతో ఈ కోటి సంతకాల ఉద్యమం ప్రారంభించబడింది అన్నారు.
ఈ కార్యక్రమంలో విశాఖ వైస్ జడ్పీ చైర్మన్ సుంకరి బాబు, పద్మనాభం ఎంపీపీ కే. రాంబా బు, పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో ఉన్న వన్ ధన్ వికాస్ కేంద్ర్రాలను బలోపేతం చేయాలి

పంట ఉత్పత్తులు అమ్మకంలో దళారుల ప్రమేయం తగ్గించాలి



**పాడేరు, పెన్ పవర్ నవంబర్ 03:** భగవాన్ బిర్సా ముండా 150 వ జయంత్యుత్సవాలు సందర్భంగా ఐటిడిఏ కాఫీ హౌస్ నందు నిర్వహించిన సమావేశములో గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వన్ దన్ వికాస్ కేంద్రాల ద్వారా వివిధ రకాల పంటలను, వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులును మార్కెట్ ధరకు కొలుగోలు చేసి, గిరిజన మహిళల ఆర్థిక పురోగాభివృద్ధికి జీవన పరిస్థితులును మెరుగుపరచడానికి , జీవనోపాధులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు . శిక్షణల ద్వారా సాంకేతికను అందిపుచ్చుకోవడం కోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఉండటం వలన మన ప్రాంతంలో పండే పంటలను మార్కెటింగ్ చేసుకోనుటకు ఉండే అనేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్ దన్ వికాస్ కేంద్రాలలో ఉన్న నిధులను దుర్వినియోగం చేసిన యెడల క్రమ శిక్షణ చర్యలు తప్పవన్నారు. ఈ ప్రాంతంలో పండే కాఫీ , మిరియాలు , అల్లం , పసుపు , అడ్డాకుల, రాజ్మా వంటి పంటలను దళారుల ప్రమేయం లేకుండా హబ్ ల ద్వారా సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ ద్వారా మార్కెటింగ్ చేసుకొనుటకు డిమాండ్ కు తగ్గట్లు సప్లై ఉండాలని దానికి తగ్గట్లు ఏర్పట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 106లు వన్ ధన్ వికాస్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లా లో ఉన్న1617 పివిటిజి గ్రామాలలో ఇన్ఫర్మేషన్ , ఎడ్యుకేషన్ మరియు కమ్యూనికేషన్ ఐఈసీ ప్రోగ్రాంల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి పెద్ద ఎత్తున ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు , అయుష్ మాన్ భారత్ కార్డులు , కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆర్ వోఎఫ్ఆర్ పట్టాలు, కుల దృవీకరణ పత్రాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కలెక్టర్, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ జన్ జాతీయ గౌరవ్ దివాస్ లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు , ప్రజా ప్రతినిధులు , అధికారులు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఎపివో, వేంకటేశ్వర్లు, డి ఆర్ డిఏ పిడి వి. మురళి , పీఎమ్ యు రాంబాబు, ప్రతినిధులు , వివిధ మండలాల ఎమ్ పిడివోలు, వి డి వి కె సభ్యులు , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## జిల్లాలో సేంద్రీయ రైతు సంఘాలు ను ఏర్పాటు చేసి సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలి.





జిల్లా కలెక్టర్ ఏ ఎస్.దినేష్ కుమార్.

**పాడేరు, పెన్ పవర్ నవంబర్ 03:** జిల్లాలో సేంద్రియ రైతు సంఘాలను ఏర్పాటు చేసి సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహించాలి. ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన లో భాగంగా 36 రకాల ప్రభుత్వం పథకాలను వినియోగించుకొని జిల్లా వ్యవసాయ అభివృద్ధిని సాధించాలి. సోమవారం జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాని ఈ పథకంలో చేర్చడం జిల్లా ప్రజలకు ఒక వరం అన్నారు . ఈ పథకంపై అగ్రికల్చర్ , హార్టీకల్చర్ , పశు స%శీ%వర్ధక శాఖ , డి ఆర్ డి ఏ , కోపరేటివ్ , మార్కెటింగ్ మొదలగు శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు . జిల్లాలో సేంద్రియ రైతు సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు . సేంద్రియ వ్యవసాయంని ప్రోత్సాహించాలి. పంట మార్పిడి విధానం ద్వారా పంట దిగుబడులు సాధించవచ్చానన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్దతులను ,సాంకేతికతను రైతులకు అందించాలన్నారు . పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడే విధముగా రైతులను ప్రోత్సాహించాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు ,విత్తనాలు పంపిణీ చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్ , లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు , జిల్లా ఉద్యాన శాఖ అధికారి కర్ణ తదితరులు పాల్గొన్నారు .

# ఆంధ్ర మెడికల్ కళాశాల 'ఆహ్వాన్-2025'






**వైద్యవృత్తి వైపు తొలి అడుగు వేసిన 250 మంది కొత్త విద్యార్థులు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 03 :**దేశంలోనే పురాతనమైన వైద్య విద్యాసంస్థలలో ఒకటైన ఆంధ్ర మెడికల్ కళాశాల లో 'ఆహ్వాన్- 2025' ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం సిఏబీ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. వై%-%25 బ్యాచ్‌కు చెందిన 250 మంది కొత్త విద్యార్థు లను ఆంధ్ర మెడికల్ కళాశాల కుటుంబంలో సాదరంగా ఆహ్వానించారు.వేడుక సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. కళాశాల అధ్యా పకులు, అధికారులు, సీనియర్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆరం భంలో దీప ప్రజ్వలనతో వేడుకను శుభారంభం చేశారు. ఇది జ్ఞానానికి, పవిత్రతకు, కొత్త విద్యా ప్రయాణానికి ప్రతీకగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజ రయ్యారు. అతిథి ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారుడా. కె.వి.ఎస్. ఎం. సంధ్యా దేవి, అదనపు డీఎంఈ %డ% ప్రిన్సిపల్, ఆంధ్ర మెడికల్ కళాశాల,డా. ఐ. వాణి, అదనపు డీఎంఈ %డ% సూపరింటెండెంట్, కింగ్ జార్జ్ ఆసుపత్రి,డా. వి. మణ్మధర రావు, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్)డా. వి. రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ (అడ్మినిస్ట్రేషన్),డా. ఎ. కృష్ణవేణి, జనరల్ వైస్ ప్రిన్సిపల్,డా. శ్యామ ల, కల్చరల్ వైస్ ప్రెసిడెంట్ ప్రిన్సిపల్ డా. సంధ్యా దేవి స్వాగత ప్రసంగం చేస్తూ కళాశాల చరిత్ర, వైద్య విద్యలో ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రతిష్టను ప్రస్తావించారు. కొత్త విద్యార్థులు క్రమశిక్షణ, దయా భావం, అంకితభావంతో తమ విద్యా ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యవృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది సేవ అనే బాధ్యత అని పేర్కొన్నా రు. విద్యార్థులు ప్రజల పట్ల కరుణ, నిజాయితీ తో వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చా రు. ఎమ్మెల్యే. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడు తూ, ఆంధ్ర మెడికల్ కళాశాల అనేది ఆంధ్రప్రదేశ్ వైద్య రంగానికి గర్వకారణం. ఇక్కడి విద్యార్థు లు దేశానికి సేవచేసే మహోన్నత వైద్యులు కావాలి" అని ఆకాంక్షించారు. అతిథులకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా, అధ్యాపకులు, నిర్వాహకులకు స్మారక చిహ్నాలు అందజేశారు. వై-25 బ్యాచ్‌కు చెందిన ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఆహ్వాన బహుమతులు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరువాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు నృత్యాలు, పాటలు, సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ఈ వేడుకతో కళాశాల ప్రాంగణం ఉత్సాహభరి తంగా మారింది.ఆహ్వాన్-2025' ఉత్సవం ఆనందభరిత వాతావరణంలో ముగిసింది. వై-25 బ్యాచ్‌కు చెందిన 250 మంది విద్యార్థు లు వైద్య వృత్తిలో తమ ప్రయాణాన్ని ప్రారంభి స్తూ 'సేవాస్ఫూర్తి'ని ప్రతిజ్ఞ చేశారు.




# కాశీబుగ్గ ఘటన దురదృష్టకరం

- భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం.
- సవ రాజకీయాలు చేస్తున్న వైసిపి.
- కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే%డ% ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 03 పెన్ పవర్.**(శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ లో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విచారం వ్యక్తం చేశారు.దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర బాధాకరమని అన్నారు.ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి,క్యూలైన్లను క్రమబద్ధీకరించింది. ప్రమాదం జరిగిన దేవాలయం పూర్తిగా ప్రైవేటు నిర్వహణలో నడుస్తోందని.ఈ ఆలయం ప్రభుత్వ ఆధీనంలో గానీ,దేవాదాయ ఆధీనంలో కూడా లేదు.కార్యక్రమానికి సంబంధించి నిర్వాహకులు ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం కూడా ఇవ్వలేదని అన్నారు.సమయం,సందర్భం,విషయం తెలుసుకోకుండా తొక్కిసలాటలో భక్తులు చనిపోగానే వైసిపి శవ రాజకీయం మొదలు పెట్టిందని. సిగ్గుండాలి మీకు. మనుసు లకు ఉండవలసిన లక్షణాలు ఒక్కటి కూడా ఈ ముఠాకి లేదని అన్నారు.దేవాలయం కమిటీ సభ్యులు పోలీస్ వారికి ప్రొటెక్షన్ ఇవ్వాలని చెప్పి లెటర్ పెట్టకుని ఆ తర్వాత కూడా పట్టించుకోకపోతే అప్పుడు ప్రభుత్వాన్ని నిందించాలి అంతేగాని ప్రభుత్వం తప్పు లేకుండా జరిగే ప్రమాదాలకు కూడా వైసిపి సైకోలు శవ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు.ఆమె వెంట బిజెపి జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షులు నిమ్మక సింహాచలం,గుమ్మలక్ష్మీపురం మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్,తెలుగుదేశం సీనియర్ కార్యకర్త మండంగి ప్రసాద్. ఫకీరు.ఉన్నారు.

# కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా అధ్యక్షుడు కొర్ర రాజు
- స్పందన లేకపోతే ఈ నెల 6నుంచి సమ్మె - కాఫీ కార్మికుల హెచ్చరిక



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం

ఆర్వీ నగర్ డివిజన్ పరిధిలోని దేవరపల్లి, సిరిబల,గూడెం–1 ఎస్టేట్ లో పనిచేస్తున్న కాఫీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర రాజు డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, "మా సమస్యలతో యాజమాన్యానికి ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చి 20 రోజులు గడిచింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 6వ తేదీ నుండి సమ్మె ప్రారంభిస్తాం" అని హెచ్చరించారు. కాఫీ తోటలను సంరక్షించడంలో, కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఏపీ ఎఫ్‌డీసీ విభాగం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోందని ఆయన విమర్శించారు. తోటలు క్రమంగా అంతరించి పోతున్న పరిస్థితిని అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాఫీ కార్మికుల సమస్యలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు విస్తరించనున్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీ నగర్ డివిజన్ నాయకులు కొర్ర రాజారావు, రామ్మద్, జెడ్జ్ పాడల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రసా బసగ మారిన సర్వసభ్య సమావేశం

గ్రామ సమస్యలపై ఎంపీటీసీలు సర్పంచులు అధికారులను నిలదీత





**పెన్ పవర్.జి.మాడుగుల:నవంబర్ (3)** జి.మాడుగుల మండలంలో ఎంపీపీ లంబోరి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు డుమ్మా కొట్టడంతో సమావేశానికి విచ్చేసిన సర్పంచులు ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సన్యాసి దొర మాట్లాడుతూ సుమారు రెండు సంవత్సరాల నుంచి గౌరవ వేతనం ఇవ్వలేదని ఈ విషయంపై ఎంపీడీవో సరియైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.పంచాయతీల్లో ఉన్న సమస్యలను ఏ అధికారికి చెప్పుకుందాం అన్న అధికారులు ఎవరు అందుబాటులో లేరని మండిపడ్డారు. ఎంపీడీవో రెండు నెలల నుంచి అందుబాటులో లేరని తెలిపారు. అధికారులు లేకుండా సర్వసభ్య సమావేశం ఏ విధంగా నిర్వహిస్తారని ఎంపీటీసీలు సర్పంచులు నిలదీశారు. సమావేశం నుండి బయటకి ఎంపీటీసీ సర్పంచులు వచ్చి బాయ్ కట్ చేశారు.

# విశాఖలో పోస్టల్ టేబుల్ టెన్నిస్ జోష్

## నవంబర్ 10 నుండి జాతీయ స్థాయి టోర్నీ






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 03 :**'దేశవ్యాప్తంగా పోస్టల్ విభాగం ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించేందుకు సిద్ధమవుతు న్నారు. విశాఖలో ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 40వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఘనంగా జరగనుందని విశాఖ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.ఎస్. జయశంకర్ ప్రకటించారు.

సోమవారం సాయంత్రం ఎంవిపి కాలనీలోని పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ జాతీయ స్థాయి పోటీలు ఎస్–3 స్పోర్ట్స్ అరీ నాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో ని 14 రాష్ట్రాల నుంచి 14 జట్లు పాల్గొననున్నా యని చెప్పారు.జయశంకర్ మాట్లాడుతూ, "ఈ టోర్నమెంట్ పోస్టల్ ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన ఆటగాళ్లకు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే వేదికగా నిలుస్తుంది" అని పేర్కొన్నా రు. గత సంవత్సరం గుజరాత్‌లోని పోర్‌బందర్ లో జరిగిన పోటీల్లో వెస్ట్ బెంగాల్ జట్టు అద్భుత ప్రతిభ కనబర్చినట్లు గుర్తుచేశారు.పోటీలు సమ గ్రంగా, సమన్వయంతో సాగేందుకు నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాభిమానులు, సంస్థలు, ప్రజలు ఈ క్రీడా ఉత్సవానికి మద్దతు ఇవ్వాలని ఆయ న కోరారు. లోగో మరియు ప్రాస్పెక్ట్ వివరాలను క్యూ.ఆర్. కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.ఈ సందర్భంగా 40వ ఆల్ ఇండి యా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లోగో మరియు టీజర్‌ను వి.ఎస్. జయశం కర్ విదుదల చేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్.వి.ఎస్.ఎన్. రాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ పి. కోమల్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి ప్రాంతాల్లో డ్రోన్లు ఎగర వేస్తే కఠిన చర్యలు.

- అరకు సీఐ హిమగిరి.



**అరకులోయ పెన్ పవర్ 3 :** అరకులోయ అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట సంబంధించి డ్రోన్స్ సర్వే నిలిపివేయబడిందని ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్ గుమ్మడి సంధ్యారాణి ప్రకటన చేసి కలెక్టర్ కి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మంత్రి ఆదేశాలు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ ఆదివాసి సంఘ నాయకులు ప్రజాప్రతినిధులు పీసా కమిటీ నాయకులతో సమావేశ పరిచి సర్వే నిలిపివేయబడింది. గ్రామసభ పిసా అనుమతులు లేనిదే ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్ళదని తెలియజేసి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ యజమాన్యానికి సర్వే నిలిపివేయబడిందని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది.మా గ్రామాల్లో డ్రోన్లు ఎగురు తున్నాయి అని కలెక్టర్ కి ఎస్పీ కి ప్రజల ద్వారా తెలియడం జరిగింది. ప్రస్తుతం మార్కెట్లు తక్కువ ధరకే డ్రోన్స్ దొరకడం వలన కొంతమంది డ్రోన్స్ ను కొని సరదాకో లేదా కావాలనే ప్రజలను రెచ్చగొట్టలనే ఈ డ్రోన్లు లను ఆదివాసి ప్రాంతంలో ఎగురవేస్తున్నారు.

ఈ విధంగా ఆదివాసి ప్రాంతంలో ప్రజలకు రెచ్చగొట్టే విధంగా ఎగరవేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దీనిపై అనంతగిరి అరకులో కొన్ని ప్రత్యేక బృందాలను ఏర్పాట్లు చేసి నిఘా ఉంచామని అరకు సీఐ హిమగిరి తెలియజేయడం అయినదనీ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

# కోటిపల్లి.. నరసాపురం రైల్వే లైన్ స్థలాల సేకరణ లో ఇబ్బందులు



**అమలాపురం రూరల్, పెన్ పవర్, నవంబర్ 03:** అమలాపురం మండలం నుండి చిందాడగరువు మరియు పేరూరు వరకు 519/1..519/3.520/1 సర్వే నెంబర్లలో ఉన్న భూమి రైల్వే మార్గ సరిహద్దుల నుండి మినహాయింపు ఇవ్వాలని అమలాపురం పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది వి.రమేష్ చంద్ర వర్మ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.. అలాగే అదే ప్రాంతంలో ఉన్న మంచినీళ్ల ట్యాంక్ ద్వారా 10 గ్రామాల ప్రజలకు నీరు అందించుతుందని. ట్యాంకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని అర్జీలో పేర్కొన్నారు. జాతీయ షెడ్యూల్ కులాలకు కులాల కమిషన్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని వర్మ తెలిపారు.

అర్జీ కి స్పందించిన ఆర్డీవో కే మాధవి సమాధానం ఇస్తూ సమస్యను గుంటూరు అరండల్ పేట రైల్వే శాఖ అధికారులకు తెలియజేయడం జరిగిందని అన్నారు. ఆదేవిధంగా కొందరు వ్యక్తులు గౌరవ హైకోర్టులో పిల్ వేయడం జరిగింది. ప్రస్తుతం హైకోర్టులో విచారణలో ఉందని ఆమె తెలిపారు...

## విద్యార్థులకు సెమిస్టర్ 2 పుస్తకాలు పంపిణీ



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 03**:జీవిఎంసీ జోన్ 2 పరిధి13వ వార్డు శ్రీకృష్ణాపురం మండల పరిషత్ పాఠశాలలో వార్డ్ కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, కూటమి నాయకులు చేతుల మీదుగా 40 మంది పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్ 2 పుస్తకాలు పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ముత్యాలరావు సచివాలయం సెక్రటరీలు స్కూల్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి.మహిళా అధ్యక్షురాలు మజ్జిరమణి

స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కన్న.శ్రీను రమణమూర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సీపీ

- సనాతన ధర్మ పీఠం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విశిష్టంగా నిర్వహణ





**గోపాలపట్నం, పెన్ పవర్, నవంబర్ 3 :**
విశాఖపట్నం నగరంలోని అడవివరం జంక్షన్ సమీపంలో శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మ పీఠం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి జయంతి ఉత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రతా బగ్చి ప్రత్యేకంగా హాజరై, స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఉత్సవ ప్రాంగణానికి చేరుకున్న సీపీకి ట్రస్ట్ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన, భక్తుల మధ్య సత్సంగంలో పాల్గొని స్వామివారి బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

సీపీ శంకబ్రతా బగ్చి మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి తెలుగు ప్రజల ఆధ్యాత్మిక చరిత్రలో అజరామరమైన వ్యక్తిత్వం. ఆయన చేసిన భవిష్యవాణీలు, ప్రజలలో నైతిక విలువలు పెంపొందించే బోధనలు నేటికీ ప్రేరణనిస్తున్నాయి," అని అన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు, నిర్వాహకులు మాట్లాడుతూ, సీపీ గారి రాకతో ఉత్సవానికి విశిష్టత చేకూరిందని తెలిపారు. జయంతి ఉత్సవాల సందర్భంగా వేదపారాయణాలు, అన్నదానం, సత్సంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. పోలీసు అధికారులు, ట్రస్ట్ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్థానిక పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పెందుర్తిలో వ్యక్తి అదృశ్యం- ఆచూకీ కోసం పోలీసులు గాలింపు



**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 03 :** స్థానిక పెందుర్తి మండలం బంటా కాలనీకి చెందిన శిష్టి రమణ (37) మూడు రోజులుగా అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఈరోజు ఆయన భార్య శిష్టి దేవి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, అక్టోబర్ 31న ఉదయం సుమారు 8 గంటల సమయంలో కూలీ పనికి వెళ్తానని చెప్పి ఇంటి నుండి బయలుదేరిన శిష్టి రమణ ఇంతవరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. ఇంటి నుండి వెళ్లినప్పుడు పసుపు రంగు టీ-షర్ట్, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ శిష్టి రమణ గురించి ఎవరికైనా సమాచారం గాని, ఆచూకీ గాని తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించవలసిన ఫోన్ నెంబర్లు : పెందుర్తి పోలీస్ స్టేషన్: 96767 97314, ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్: 94407 96039

# శ్రీ సాంబమూర్తి శూలాల మహోత్సవం





- శాంతియుత నిర్వహణకు పటిష్ట బందోబస్తు
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో పోలీసులు సన్నద్ధం

**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 3 :** మునగపాక మండలంలోని ప్రసిద్ధ శ్రీ సాంబమూర్తి స్వామివారి శూలాల మహోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లను విస్తృతంగా చేపట్టింది. ఈ మహోత్సవం భక్తి పరవశంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట బందోబస్తు అమలు చేస్తున్నట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా మునగపాక ప్రాంతాన్ని సందర్శించి, శ్రీ సాంబమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై పోలీసు శాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించింది.

పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, ఎలమంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు, మునగపాక ఎస్సై ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో, ప్రధాన రహదారుల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ శూలాల ప్రదర్శన సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వేలాది భక్తులు విచ్చేస్తారు. వారందరికీ భద్రతతో పాటు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. పోలీసులు అప్రమత్తంగా ఉండాలి, భక్తులు కూడా సహకరించాలని తెలిపారు.

ఈ మహోత్సవం సందర్భంగా సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు, పహారా బృందాలు, మహిళా పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ విభాగం సమన్వయంతో 24 గంటల భద్రతా చర్యలు కొనసాగనున్నాయి. జిల్లా పోలీసు కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, భక్తులు శాంతియుతంగా ఉత్సవాన్ని ఆస్వాదించాలని, ఎటువంటి రద్దీ లేదా అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసు సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## అనకాపల్లిలో ప్రజా ఫిర్యాదుల వేదికలో 82 ఫిర్యాదులు స్వీకరణ

### త్వరిత పరిష్కారానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 03 :** స్థానిక అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మొత్తం 82 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టడం లక్ష్యంగా పోలీసులు ముందుకు వస్తున్నారు.

ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలు 24, కుటుంబ కలహాలు 4, మోసాలకు సంబంధించినవి 5, మరియు ఇతర విభాగాలకు చెందినవి 49 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ ఫిర్యాదుల స్వీకరణ అనంతరం సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి, తగిన పరిష్కారం చూపాలి. చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని ఆయన సూచించారు. జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. "ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యం. అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రజా సమస్యలను న్యాయపరంగా, పారదర్శకంగా పరిష్కరించడంలో కట్టుబాటుతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా ప్రజలు నేరుగా పోలీస్ అధికారులను కలుసుకొని తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ విధానంతో సమస్యలు తక్షణం గుర్తించి, పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకునే అవకాశం లభిస్తోంది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. మోహన రావు, ఎస్సై వెంకన్న, మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 8 కిలోల గంజాయి పట్టివేత....



- నలుగురు వ్యక్తులతో పాటు 4 మొబైల్ ఫోన్లో స్వాధీనం...
- ఎస్సై వై.తారకేశ్వరరావు

**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 03):** గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం మండలంలో గల చమ్మచింత జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 40 వేల రూపాయలు విలువచేసే సుమారు 8 కేజీల గంజాయి తో పాటు 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నమని ఎస్సై వై తారకేశ్వరరావు తెలిపారు. వివరాలకు వెళితే తమిళనాడు రాష్ట్రానికి చెందిన డి .దీపక్ బాబు (24), ఆర్ గౌతమ్ (44), ఏ హరీష్ (22),తుని మండలం, రేఖ వాణి పాలెం గ్రామానికి చెందిన తుమ్మ అప్పారావు (60) అనే నలుగురు దారకొండ ప్రాంతం నుండి గంజాయి తీసుకొని తుని రైల్వే స్టేషన్ ద్వారా తమిళనాడు రాష్ట్రానికి రవాణా చేయడానికి సిద్ధపడగా పట్టుకోవడం జరిగిందని అన్నారు. వారిపై గంజాయి అక్రమ రవాణా కేసు నమోదు చేసి నర్సీపట్నం కోర్టులో రిమాండ్ కు పంపడం జరిగిందని ఎస్సై తెలియజేశారు.

## మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం





**కూర్మన్నపాలెం : పెన్ పవర్, నవంబర్ 03**
వైస్సార్సీపీ 87 వార్డు అధ్యక్షుడు
బొడ్డ గోవింద్
ఆధ్వర్యంలో పీఎస్ నెంబర్ 88లోగల సిద్దార్థ నగరలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. గాజువాక వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేశారు. వార్డ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమానికి వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వైసిపి 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపట్టారు ప్రభుత్వ ఉన్న ఐదు సంవత్సరాల్లో 7 కాలేజీలు పూర్తయ్యాయి మిగతా కూడా చివర విడతలో ఉన్నాయని వాటిని కూటమి ప్రభుత్వం 17 కాలేజీలను ప్రైవేటు ప్రైవేటీపరం వాటి వల్ల పేద విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని దానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్ కి సమర్పించాలని దాన్లో భాగంగా ఈరోజు అ 87వ వార్డు లో కోటి సంతకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు 87వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డ గోవింద్,
గాజువాక బీసీ సెల్ అధ్యక్షుడు
చిత్రాడ వెంకటరమణ,ముద్దపు. %వా%దాముదరరావు,దుగ్గపు. దానప్పలు,బొడ్డ. వెంకటసురి,దరికి. రవి,జల్లి. బాబ్జి, జె. యన్. మూర్తి, జి. డేనియల్,యల్. ఐ. సి. నాయుడు,మార్పు. గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు , శాసన సభ్యుడు పల్లా కి ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఓనర్స్ వినతి





**గాజువాక పెన్ పవర్, నవంబర్ 03:**దశాబ్దాల శాంకేతిక నైపుణ్యం, అనుభవం ఉన్నప్పటికీ అనేక ఆర్థిక ఇబ్బందులతో అభివృద్ధికి నోచుకోని ఎ.పి. టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ఓనర్స్ అసోసియేషన్, ప్రభుత్వ సహాయం కోసం వినతి పత్రం అందజేశారు.

విశాఖపట్టణం, గాజువాక, ఆటోనగర్లో ఏర్పడి ఉన్న ఎ.పి. టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ఓనర్స్ అసోసియేషనికి చెందిన వారము. సుమారుగా 20 సంవత్సరాల క్రితం అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని పనిచేస్తున్నామని. ఈ అసోసియేషన్ సభ్యులుగా గతంలో జీవనోపాధి నిమిత్తం విదేశాలలో ఉద్యోగం కొరకు ముంబాయి, ఢిల్లీ, చెన్నై, కేరళ, తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఇంటర్వ్యూలకు హాజరై విదేశాలలో అనేక కష్టనష్టాలను ఓర్చుకొని, చాలా నైపుణ్యాన్ని సంపాదించికొని, సుమారుగా 10 సం?లు పైగా ఉద్యోగాలు చేసియున్నామని ఈ సంధర్భాలలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదర్కొని, ఆయా ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అక్కడ భాష రాక ఏజెంట్స్ చేతిలో అనేక మందిమి మోసపోయేవారం. మేమే కాక మాలాగా అనేక మంది మోసపోతున్న పరిస్థితులలో, మన ఆంధ్రా ప్రాంత నిరుద్యోగులు మోసపోకుండా, వారికి ఆర్థిక భారం పడకుండా, ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడుగా, విదేశాలలో పనిచేసిన మా అనుభవంతో సుమారు 140 మందిమి కలసి వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, రిగ్గర్, సఫ్ హెూల్డర్స్ తదితర శాంకేతిక విద్యలందు నిరుద్యోగులకు నైపుణ్యం పెంచేందుకు ఎం ఎస్ ఎం ఈసర్టిఫికేట్, లేబర్ లైసెన్సులతో, సుమారు 100 టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్ ఏర్పాటు చేసాము. వీటివలన విదేశీ కంపెనీ డెలిగేట్స్ ఇక్కడకే వచ్చి మన ప్రాంత నిరుద్యోగులను రిక్రూట్ చేసుకొనే విధంగా మేము కృషి చేస్తూ, మేమందరం కలసి ఎ.పి.టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయుట జరిగింది.పారదర్శకంగా, తక్కువ ఖర్చులతో మేమందించే శిక్షణ వలన, ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలయిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలతోపాటు పొరుగున ఉన్న తెలంగాణా, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలనుంచి కూడా గాజువాక ఆటోనగర్లో ఉన్న మా ఇనిస్టిట్యూట్సు అనేక మంది నిరుద్యోగులు వచ్చి శిక్షణ తీసుకొని విశాఖపట్టణంలోని స్టీల్ప్లాంట్, గంగవరం, హెచ్.పి.సి.ఎల్., ఐ.ఒ.సి.ఎల్., షిప్యార్డు, నేవల్ డాక్యార్డు, ఎస్.టి.పి.సి. లాంటి ప్రభుత్వరంగ సంస్థలలోని కాంట్రాక్ట్ పనులలోను, విశాఖలోని ఇతర చిన్న పరిశ్రమలలోను పనిచేస్తూ అనుభవం సంపాందించికొని ఆ అనుభవంతో విదేశీ కంపెనీ డెలిగేట్స్ గాజువాకకే వచ్చి రిక్రూట్ చేసుకొనే విధంగా అవకాశాలు కల్పించటం వలన, వారు ఆ రిక్రూట్మెంట్స్లో సెలెక్టు అయ్యి ప్రతీ సంవత్సరం వేల సంఖ్యలో నిరుద్యోగులు తద్వారా వారి కటుంబాలు జీవనోపాధి పోందుచున్నారని,

ఈ ప్రాంత నిరుద్యోగులు తమ జీవనోపాధి కోసం, విదేశాలలో ఉద్యోగం కోసం ముంబాయి, ఢిల్లీ, చెన్నై, కేరళ, తదితర ప్రాంతాలకు వెళ్ళ వలసి వచ్చేది. నేడు ఇక్కడే రిక్రూట్మెంట్స్ జరగటం వలన, నిరుద్యోగులు మోసం పోవటం లేదు. అంతేకాక వారికి ఆర్థిక భారం తగ్గిపోయింది. కాలక్రమేణా ఈ ప్రాంతంలో మేము చేస్తున్న కృషి వలస అత్యంత నైపుణ్య కలిగిన టెక్నీషియన్స్ విశాఖపట్టణంలో లభిస్తున్నారని విదేశీ కంపెనీలు గుర్తించటం వలన ముంబాయి, ఢిల్లీ, చెన్నై, కేరళలలో ఉన్న వారి రిక్రూట్మెంట్ ఏజెన్సీస్ మాతో సంప్రదించి, గాజువాక ఆటోనగర్లో ఉన్న మా ఇనిస్టిట్యూట్స్, మా మెషినరీని ఉపయోగించికొని ఇక్కడే స్కిల్ టెస్టు నిర్వహించి అనేక మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. విదేశాలలో ఉద్యోగం పొందిన అనేకమంది నేడు ఉన్నత స్థితిలో జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంత చిన్న పరిశ్రమలకు మేన్పవర్ కొరత లేకుండా మేం చేస్తున్న కృషి కూడా తోడయింది. ఈ రిక్రూట్మెంట్స్ నిర్వహణ కోసం వచ్చే విదేశీ డెలిగేట్స్ వలన గాజువాకలోని హెూటల్స్, రెస్టారెంట్స్, రవాణా రంగం, గ్యాస్ ఏజన్సీస్, ఎలక్ట్రికల్ %డ% హార్డ్వేర్, హాస్పటల్స్, కూడా పరోక్షంగా లాభపడి ఆయా సంస్థలలో ఎంతో మంది ఉపాధిపొందుతున్నారు. మా సంస్థలలో పనిచేసే ఇన్స్ట్రక్టర్స్, స్టాఫ్ అంతా కలిపి 1000మంది వరకు ఉంటారు. వీరందరకూ, వీరి కుటుంబాలకు మా ఇనిస్టిట్యూట్స్ జీవనోపాధిని అందిస్తున్నాయని

గాజువాక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి మేం కూడా ఒక ముఖ్యభూమిక పోషిస్తున్నామని సవినయంగా తమకు మనవి చేసుకుంటున్నాము. మా అసోసియేషన్ సభ్యుల, మా ఇనిస్టిట్యూట్స్, స్కిల్ సెంటర్స్ పరిస్థితి వెనక్కి తిరిగి చూసుకుంటే "ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి"లా ఉన్నది. మాకు సొంతంగా వర్క్షాపులు లేక పోవుట వలన ఆటోనగర్లో అద్దెకు తీసుకొని ఇనిస్టిట్యూట్స్ నడుపుచున్నాము. కరోనా తరువాత మా పరిస్థితులు అగమ్యగోచరంగా మారిపోయాయి. ఇనిస్టిట్యూట్స్ రెంట్, స్టాఫ్ జీతాలు, ట్రైనింగ్ ఖర్చులు బాగా పెరిగిపోయి ముందుకు సాగటం చాలా కష్టంగా మారిపోయింది. దీనికి తోడు రిజస్టర్ కాని ఇనిస్టిట్యూట్స్, ఏజెంట్స్ ద్వారా విదేశాలలో రిక్రూట్ అయిన ఉద్యోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా, ఆ సమస్యకు మాకు ఏవిధమైన సంబంధం లేకపోయినా మాపై తీవ్రవత్తిడి పెరుగుతున్నది. మాపై బెదిరింపులు పెరిగి తీవ్రమైన మానసిక వత్తిడికి గురౌతున్నాము. ఈ ప్రభావం ప్రస్తుతం మా వద్ద శిక్షణ పొందుచున్న వారిపై కూడా పడి మేం నష్టపోతున్నాము, మరియు విదేశాలలో ఉద్యోగాలకు చేయించుకోవలసిన మెడికల్ టెస్టు గమ్క మెడికల్ సెంటర్ ద్వారా చేయించుకోవాలి. ప్రపంచలోనే అతి తొందరాగా అభివృద్ధి చెందుతున్న విశాఖనగరంలో ఆ సదుపాయం లేక పోవటం వలన హైదరాబాద్, చెన్నై వెళ్లవలసి ఉండటం వలన నిరుద్యోగులపై

విపరీతమైన ఆర్థిక భారం పడుచున్నది. కావున తమరు దయవుంచి మా ఈ పరిస్థితిని అర్థం చేసుకొని, సానుకూలంగా మా విజ్ఞప్తిని పరిశీలించి ఈ క్రింది విధంగా మాకు సహయం అందించాలని వేడుకొంటున్నామని

సొంతగా మా ఇనిస్టిట్యూట్స్ ఏర్పాటు చేసుకొనుటకు స్థలం, మా ఇనిస్టిట్యూట్స్లో మెషినరీ, ఎక్యూప్మెంట్స్ కొనేటప్పుడు ప్రభుత్వం నుండి రాయితీ.

విశాఖపట్టణంలో గమ్ కా మెడికల్ సెంటర్ ఏర్పాటు.

మా ఇనిస్టిట్యూట్స్లో శిక్షణ పూర్తి చేసుకొన్న వారికి సర్టిఫికేట్స్ ఇచ్చేందుకు అనుమతి, మాకు, మాఇనిస్టిట్యూట్ శిబ్బందికి వైద్య, ఆరోగ్య సదుపాయాలు ప్రభుత్వం నుండి ఏర్పాటు.

తదితర పై అంశాలు పరిశీలించి, తగు చర్యలు చేపట్టి మాకు సహాయం అందించాలని వినతి పత్రం ద్వారా తెలియపరిచారు .

# పోలీసు అమరవీరుల సంస్మరణలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 03 :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, "సమాజ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత. విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, క్రమశిక్షణ, సేవా భావం, మరియు ఆధునిక పరికరాల వినియోగంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం," అని తెలిపారు.

కార్యక్రమంలో విద్యార్థులకు ఏకె-47, గ్లోక్-17 పిస్టల్, ఇన్సాస్ రైఫిల్, మల్టీ గ్యాస్ గన్ లాంచర్, గ్రెనేడ్ తదితర ఆయుధాలు, అలాగే రైట్ గేర్ సెట్స్, బాంబ్ డిఫ్యూజల్ పరికరాలు, నైట్ విజన్, సెర్చ్ మెటల్ డిటెక్టర్లు వంటి భద్రతా పరికరాలు ప్రదర్శించారు. అదేవిధంగా కమ్యూనికేషన్ పరికరాలైన శాటిలైట్ ఫోన్, స్కానర్, వి.హెచ్.ఎఫ్ సెట్స్, రోబో సూట్, అలాగే డాగ్ స్క్వాడ్లోని బన్నీ (మత్తు పదార్థ గుర్తింపు), రియో (ట్రాకింగ్), లక్కీ (మందు పాతర గుర్తింపు) కుక్కల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది.

ఫింగర్ ప్రింట్ మరియు క్లూస్ టీం నేరస్థల పరిశోధనలో సాక్ష్యధారాల సేకరణ పద్ధతులను వివరించగా, విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ఉత్సాహంతో పాల్గొన్నారు.



కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవ ప్రసాద్, ఎల్. మోహన్ రావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, గఫూర్, రామకృష్ణరావు, మన్మధరావు, అనకాపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, ఫింగర్ ప్రింట్స్ ఇన్స్పెక్టర్ విజయ, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ మహిళ క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత మహిళా క్రికెట్ టీమ్ కు అభినందనలు



**గాజువాక పెన్ పవర్, నవంబర్ 03** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారత్ మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. గాజువాక నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దేశం కన్నా మహిళా క్రికెట్ ప్రపంచ కప్ కలను ఈరోజు మన భారత మహిళలు సంపాదించడం ఎంతో గర్వకారణమని అన్నారు. భారత్ మహిళా క్రికెట్ జట్టు దేశంలో ఉన్న ప్రతి ఒక్క మనసులో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కనక భవాని, కార్యదర్శి సన్యాసమ్మ, ఉపాధ్యక్షురాలు పద్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంబాయి, మహిళా నాయకురాలు శ్వేత, యజ్ఞప్రియ, జ్యోతి,దేవి,తదితరులు పాల్గొన్నారు.

# గూగుల్ డేటా సెంటర్, అంబుజా సిమెంట్

- ఫ్యాక్టరీ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా సిపిఐ ఉద్యమం
- ప్రజా ప్రయోజనాలకు భూములను కాపాడాలని జిల్లా కలెక్టర్కి వినతిపత్రం సమర్పణ





**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 03 :**విశాఖ జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ మరియు అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపనకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా ప్రతినిధి బృందం సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ని కలిసి వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ అమెరికా తర్వాత అతిపెద్ద డేటా సెంటర్గా విశాఖలో గూగుల్ సంస్థ అదానీతో కలిసి ఏర్పాటు చేయబోతున్నదని, దానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో 480 ఎకరాల భూము లను ప్రభుత్వం కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఆయన వివరించ గా, ఆనందపురం మండలం తర్లవాడ పంచా యతీలో దళితుల సాగుభూములైన 200 ఎకరాలు, సింహాచలం పరిసరాల్లో అడవి భూములైన 160 ఎకరాలు, రాంబిల్లి, అచ్చుతా పురం ప్రాంతాల్లో మరో 12 ఎకరాలు ఈ ప్రాజెక్టు కోసం కేటాయించారని తెలిపారు. 2019లో కూడా అదానీకి ఉప్పాడ ప్రాంతంలో భూములు ఇచ్చినా, అవి ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయని పేర్కొని కొత్తగా రైతుల భూములు తీసుకోవడం అన్యాయమని అన్నారు.గూగుల్ డేటా సెంటర్ వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, భూగర్భజలాలు ఎండిపోవడం, విద్యుత్ కొరత వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని చంద్రశేఖర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభు త్వం పునరాలోచన చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని చెప్పారు.అదే విధంగా, పెదగంట్యా డ ప్రాంతంలో అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా కూడా సిపిఐ ప్రతినిధులు తీవ్రంగా స్పందిం చారు. గత నెల 8న కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ఏకగ్రీవంగా వ్యతిరేకత తెలిపినా, ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం ప్రజల అభిప్రాయానికి విరుద్ధమని పేర్కొన్నారు.

గంగవరం పోర్టు ఉదాహరణను ప్రస్తావిస్తూ స్థానికులకు ఉపాధి లేకపోవడమే కాకుండా కాలుష్యం పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితే మళ్లీ పునరావృతం కాకూడదు అని సిపిఐ నాయ కులు హెచ్చరించారు.ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. మన్మధరావు, ఆర్. శ్రీనివాసరావు, ఎం.డి. బేగం, నెయ్యల నాగభూషణరావు, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

# పెందుర్తిలో ఘనంగా పిసిపిఎల్ మూడవ వార్షికోత్సవ మహోత్సవం





**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 3 :** స్థానిక పెందుర్తి నియోజకవర్గంలో చర్చెస్ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ (పిసిపిఎల్) ఆధ్వర్యంలో మూడవ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని, వార్షికోత్సవ కేక్ను కట్ చేసి పాస్టర్స్ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

"సమాజ సేవలో చర్చి పాస్టర్స్ మరియు ఆధ్యాత్మిక నాయకులు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని, మన సమాజంలో సేవాస్ఫూర్తి కలిగిన నాయకులు ఎక్కువగా ఉండాలని" అన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. జీవీఎంసీ 96వ వార్డు, పోలీస్ స్టేషన్ డౌన్, ఎస్సీ బాలికల వసతి గృహం సమీపంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డుంబారి రామారావు, అసోసియేషన్ అధ్యక్షులు ఎల్లయ్య, వ్యవస్థాపకులు మరియు జనరల్ సెక్రటరీ జాకబ్ జో, కోశాధికారి బ్రదర్ ఎస్. అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ అనిల్ బాబు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జీవకల, డీబీఎల్ నాయుడు, రాపర్తి కిషోర్, లక్కీ గోవింద తదితర పాస్టర్లు, ఎన్డీఏ మహాకూటమి నాయకులు మరియు అనేకమంది విశ్వాసులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాస్టర్స్ మరియు విశ్వాసులు పంచకర్ల రమేష్ బాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ, తమ సమాజాభివృద్ధికి నిరంతర సహకారం అందించాలని కోరారు.

# జీవీఎంసీ జోన్-8 ప్రజా ఫిర్యాదుల వేదికలో 10 ఫిర్యాదులు స్వీకరణ

* అధికారులకు సత్వర పరిష్కారం సూచించిన జెడ్సీ శంకర్రావు




**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 3 :** విశాఖపట్నం, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో మొత్తం 10 ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. వేపగుంట జోనల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జోనల్ కమిషనర్ జెడ్సీ శంకర్రావు నేతృత్వం వహించారు. ప్రజల సమస్యలను స్వయంగా విని, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ప్రతి అంశాన్ని సమయానికి పరిశీలించి, నిర్దిష్ట గడువులోపు పరిష్కార నివేదికను సమర్పించాలని జెడ్సీ శంకర్రావు స్పష్టం చేశారు. "ప్రజల సమస్యలపై స్పందించడం ప్రతి అధికారికి బాధ్యత. ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి" అని ఆయన హెచ్చరించారు.

**విభాగాల వారీగా ఫిర్యాదులు..**

ఈ సందర్భంగా స్వీకరించిన 10 ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, ఇంజినీరింగ్ విభాగం (ఈఈ)కు 1, రెవెన్యూ శాఖకు 2, ఏఎంఓహెచ్ 3, ఏపీడి 1, వీధిలైట్లకి 1 ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ప్రధానంగా రోడ్ల మరమ్మతులు, అనుమతి సమస్యలు, భూసంబంధిత ఇబ్బందులు వంటి అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.

**తక్షణ చర్యలకు హామీ..**

ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న అధికారులు తగిన చర్యలు తీసుకోవడానికి హామీ ఇచ్చారు. ఫిర్యాదుల పరిష్కారం పట్ల జోన్%-%8 అధికారులు కట్టుబడి ఉన్నారని వారు తెలిపారు.

**ప్రజా విశ్వాసాన్ని పెంచుతున్న ఫిర్యాదుల వేదిక..**

ఈ తరహా ప్రజా ఫిర్యాదుల వేదికలు ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని పలువురు పౌరులు అభిప్రాయపడ్డారు. సమస్యలు నేరుగా అధికారుల ముందుంచుకునే అవకాశాన్ని ఈ కార్యక్రమాలు కల్పిస్తున్నాయని, ప్రజా పాలనలో పారదర్శకతను తీసుకువస్తున్నాయని వారు పేర్కొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమం

* జీవీఎంసీ 88వ వార్డులో సంతకాల సేకరణ





**పెందుర్తి, నరవ, పెన్ పవర్, నవంబర్ 3 :**ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా అవగాహన కల్పించేందుకు, అలాగే ప్రజా వైద్య సదుపాయాల రక్షణ కోసం కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం 88వ వార్డు, వెదులు నరవలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ప్రజల ఆరోగ్య హక్కులపై దాడి వంటిదే. పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండే హక్కు క్రమంగా దూరమవుతుంది" అని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రాధాన్యతను వివరించారు. ప్రైవేటీకరణ వలన సాధారణ ప్రజలకు అందుబాటు తగ్గి, వైద్య సేవలు వ్యాపారమవుతాయి. ప్రజా వైద్య సదుపాయాలను కాపాడడం మనందరి బాధ్యత" అని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు, స్థానిక యువకులు, మహిళలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ సంతకాలు చేసి, ప్రభుత్వ వైద్య విద్య వ్యవస్థ రక్షణకు తమ మద్దతు తెలిపారు. సంతకాల సేకరణ బృందాలు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాయి. కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ సంతకాల సేకరణ ద్వారా ప్రజల స్వరాన్ని ప్రభుత్వానికి వినిపించడమే మా లక్ష్యం. ప్రతి సంతకం ప్రజా హక్కుల కోసం ఒక బలమైన స్వరం అవుతుందని, ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత - 4600 కిలోల బియ్యం స్వాధీనం

**రావులపాలెం,పెన్ పవర్ నవంబర్ 3 :**అక్రమ రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వ్యక్తిని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం రావులపాలెం డిగ్రీ కాలేజ్ ఎదుట ఉన్న ఎన్హెచ్-16 రహదారిపై, పాలకొల్లు నుంచి జొన్నాడ వైపు అక్రమంగా బియ్యం తరలిస్తున్న జక్కంశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు.తన వాహనంలో ఉన్న 94 బస్తాల బియ్యం (సుమారు 4,600 కిలోలు) ను విజిలెన్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు ఉపయోగించిన టాటా ఏసీ వాహనం (నంబరు %ూూ 39 ఔఖీ% 5794)ను కూడా అధికారులు పట్టుకున్నారు.విజిలెన్స్ అధికారుల రిపోర్టు ఆధారంగా రావులపాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. చంటి తెలిపారు.

అక్రమ రేషన్ బియ్యం రవాణా చేసిన డ్రైవర్పై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# పెందుర్తిలో రూ.2 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు





* విశాఖ అభివృద్ధే లక్ష్యం - ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు
* జీవీఎంసీ 93వ వార్డులో ప్రారంభమైన ప్రధాన పనులు

**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 3 :**

పెందుర్తి నియోజకవర్గంలోని జీవీఎంసీ 93వ వార్డు పరిధిలో సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపన కార్యక్రమాలు ఈరోజు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, అలాగే విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమం జీవీఎంసీ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో జరిగింది.

**విశాఖ అభివృద్ధే లక్ష్యం - ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు..**

ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులతో పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని రాష్ట్ర ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయి. పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధే నా ప్రధమ కర్తవ్యం. రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు.

**జీవీఎంసీ 93వ వార్డులో ప్రారంభమైన ప్రధాన పనులు..**

జీవీఎంసీ జోన్ 8 పరిధిలోని పలు కాలనీల్లో రహదారులు, కమ్యూనిటీ హాల్స్ వంటి నిర్మాణ పనులకు రమేష్ బాబు మరియు మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు.

**ప్రధాన ప్రాజెక్టులు:**

సాయి మాధవ్ నగర్ వినాయకుని ఆలయం ఎదురుగా రూ.20 లక్షలు కమ్యూనిటీ హాల్, రూ.19.63 లక్షలు సీసీ రోడ్లు నిర్మాణం. కృష్ణానగర్ హోమియోపతి ఆసుపత్రి వద్ద రూ. 31.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ ప్రారంభం. బాలాజీ గార్డెన్స్ రూ. 19.87 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం. ప్రహ్లాదపురం రూ. 18.50 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణం. రూ. 35.20 లక్షల శివాలయం వెనుక ఆరు సీసీ రోడ్ల ప్రారంభం. రూ. 19.98 లక్షలు కమ్యూనిటీ హాల్ నిర్మాణం. వెంకటాద్రి నగర్ రూ. 34 లక్షల సీసీ రోడ్లు. పోస్టల్ కాలనీ రూ.18.43 లక్షలు సీసీ రోడ్లు. శ్రీనివాస్ నగర్ రూ. 15.50 లక్షలు సీసీ రోడ్లు, మొత్తం సుమారు రూ. 2 కోట్ల రూపాయల వ్యయంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టబడ్డాయి.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు, మేయర్తో పాటు కార్పొరేటర్ రాపర్తి కన్నా, జీవీఎంసీ జోన్ 8 జోనల్ కమిషనర్ శంకరరావు, ఇంజనీరింగ్ విభాగం డి.ఈ ప్రవీణ్, ఏ.ఈ కుసుమ, మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, వార్డు అధ్యక్షులు తమరాడ ఆదిబాబు, వరహాలు, సీనియర్ నాయకులు కోరుకొండ వరహాలు, ఎర్ర నాగరాజు, సేనాతీ దేవుడు, ఏఎంసీ డైరెక్టర్ లక్కీ గోవింద్, హైమావతి, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, డి.బి.ఎల్. నాయుడు, మజ్జి సూరిబాబు, ఒబ్బిన శ్రీకాంత్, జగన్మోహన్ పాత్రుడు, జుత్తాడ శ్రీనివాసరావు, మోటూరు చైతన్య, రాపర్తి కిషోర్, తనకాల శ్రీనివాసరావు, కర్రి శివ మరియు స్థానిక కాలనీ అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు. జీవీఎంసీ 93వ వార్డు సాయి మాధవ్ నగర్, కృష్ణానగర్, బాలాజీ నగర్, ప్రహ్లాదపురం, వెంకటాద్రి నగర్ ప్రాంతాల ప్రజలు, ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హైటెన్షన్ లైన్ కింద ప్రమాదం

**కంపరపాలెంలో చిన్నారి గాయాలు,**

**ఐదు ఇళ్లలో విద్యుత్ పరికరాలు ధ్వంసం**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 3 :** జీవీఎంసీ 92వ వార్డు, కంపరపాలెం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన విద్యుత్ ప్రమాదం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. పండూరు రోహన్ (8) అనే చిన్నారి తన ఇంటి మేడపై ఆడుకుంటూ సీరియల్ లైట్స్ను సమీపంలోని హైటెన్షన్ టవర్ లైన్ వైర్లపైకి విసరడంతో, అనూహ్యంగా భారీ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. అదే క్షణంలో విద్యుత్ తీగల ద్వారా ఉద్భవించిన మినుగురు జ్వాలలు ఇంటి పైకప్పు దాకా వ్యాపించడంతో చిన్నారికి విద్యుత్ షాక్ తగిలి ముఖం, చెంప, చేతులపై తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే రోహన్ను విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ కి తరలించారు. వైద్యుల ప్రకారం, బాలుడి ముఖభాగంలో గాయాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో శస్త్రచికిత్స అవసరం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం బాలుడు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు.

**ఇళ్లలో విద్యుత్ పరికరాల నష్టం..**

ఈ ప్రమాదంతో ఆ చిన్నారి ఇంటికే కాకుండా ఆ హైటెన్షన్ లైన్ కింద ఉన్న ఐదు ఇళ్లలోని మీటర్లు, టెలివిజన్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు, వైరింగ్, ప్లగ్ పాయింట్లు వంటి పరికరాలు ఒక్కసారిగా పేలిపోయాయి. కొన్ని ఇళ్లలో వైరింగ్ పూర్తిగా కాలిపోయి, గోడలపై బొగ్గు మరకలు ఏర్పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఆ హైటెన్షన్ టవర్ లైన్ ఇళ్లకు అత్యంత సమీపంగా ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు.

పలు సార్లు విద్యుత్ శాఖ అధికారులకు ప్రమాదం గురించే ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజల ఆందోళన, అధికారుల స్పందన అవసరం..**

ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడింది. విద్యుత్ శాఖ సిబ్బంది హైటెన్షన్ లైన్ పక్కన ఉన్న ఇళ్లలో వైరింగ్ను పరిశీలిస్తున్నారు.

స్థానికులు భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా హైటెన్షన్ లైన్ను తరలించాలనే డిమాండ్ చేస్తున్నారు. ఇక చిన్నారి రోహన్ ఆరోగ్య పరిస్థితిపై కేజీహెచ్ వైద్య బృందం క్రమం తప్పకుండా నివేదికలు అందిస్తున్నట్లు సమాచారం.

# ఏజెన్సీలో మహిళపై పాముకాటు.



**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 03 పెన్ పవర్.** మండలంలో గల ఏజెన్సీ ప్రాంతంలో ఓ మహిళపై పాముకాటు వేసింది. ఈ విషయంపై గ్రామస్తుల మీడియాకు ఇచ్చిన సమాచారం మేరకు గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయతీ బాలేసు గ్రామంలో కొండగొర్రి బుగ్గి,భర్త రామారావు, అనే మహిళపై జీడి మామిడి తోటలో పనిచేస్తున్న సమయంలో మహిళ పై పాము కాటు వేసిందని విషయం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై తీసుకువచ్చామని అన్నారు. డాక్టర్ ప్రధమ చికిత్స చేసి ఆమెకు ప్రాణపాయం లేదని ప్రస్తుతానికి నిలకడగా ఉందని మెరుగైన వైద్యం నిమిత్తం కురుపాం ఆసుపత్రికి తరలిస్తున్నామని డాక్టర్ అన్నారని గ్రామస్తులు అన్నారు.

# ఆల్ ఇండియా 40 వ పోస్టల్ టేబుల్ టెన్నిస్ క్రీడల పోటీలు

**ఈ నెల 10 వ తేదీ నుండి 14 వరకు ఎంవిపి కాలనీ ఎస్ శ్రీ స్పోర్ట్స్ ఏరినాలో టేబుల్ టెన్నిస్ క్రీడలు**

**విశాఖపట్నం రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ వివిఎస్ జయ శంకర్.**




**విశాఖ తూర్పు,పెన్ పవర్ నవంబర్ 03.** ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు నగరంలో ఎంవిపి కాలనీ స్పోర్ట్ ఎరీనాలో ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ క్రీడలు నిర్వహించ నున్నట్లు విశాఖ పట్నం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ వి.ఎస్.జయ శంకర్ తెలిపారు.సోమవారం ఎంవీపీ కాలని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోస్టల్ రీజియన్ 40 వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహిస్తా మన్నారు. దీనికి సంబంధించిన లోగో మరియు టీజర్ను ఆయన ఆవిష్కరించారు.ఈ క్రీడల్లో దేశ వ్యాప్తంగా గల వివిధ రాష్ట్రాల నుంచి 14 టీముల్లో 121 మంది క్రీడాకారులు పాల్గొంటా రన్నారు. వీటిలో మెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్స్ అలగే విమెన్స్ సింగిల్స్, విమెన్స్ డబుల్స్ క్రీడలు ఉంటాయన్నారు. గత సంవత్సరం గుజరాత్ పోరుబందరు లో ఈ క్రీడలు ఘనంగా నిర్వహించా రన్నారు.వాటిలో వెస్ట్ బెంగాల్ జట్టు సభ్యులు మంచి ప్రతిభ కనబరిచి పలు అవార్డులు దక్కించుకున్నా రన్నారు. కొత్తగా ఆవిష్కరించబడిన లోగో టేబుల్ టెన్నిస్ ఆటను నిర్వచించే డైనమిక్ ఎనర్జీ మరియు స్విఫ్ట్ కదలిక, నైపుణ్యం మరియు క్రీడా నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుం దన్నారు. ఈ డిజైన్ ఐక్యత, పోటీ శక్తి మరియు క్రీడల పట్ల పెరుగుతున్న ఉత్సాహాన్ని సూచిస్తుందన్నారు. ఈ టీజర్ టోర్నమెంట్ స్థాయిని అద్భుతంగా చూపించడమే కాకుండా, పోటీ తత్వం, క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుం దన్నారు. క్రీడా ఔత్సాహికులు, సంస్థలు, సాధారణ ప్రజలు ఈ టోర్నమెంట్లో చేరి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ మీడియో సమావేశంలో విశాఖపట్నం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్.వి.ఎస్.ఎన్ రాజు, డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్,రీజినల్ ఆఫీసు అసిస్టెట్ డైరెక్టర్ కె.వి.డి.సాగర్ తదితరులు పాల్గొన్నారు

# అయ్యప్ప స్వామి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసిన పైల పోతురాజు దంపతులు....




**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 03):** నర్సీపట్నం వై జంక్షన్ లోగల శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న గణపతి ఆలయం వద్ద ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా నాతవరం మండలం నాతవరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు పైల పోతురాజు దంపతులు సోమవారం ఆలయం వద్దకు వచ్చిన అయ్యప్ప స్వామి భక్తులకు సద్ది ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో శ్రీశ్రీశ్రీ ప్రసన్న గణపతి ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు ఒకరోజు అయ్యప్ప స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. శ్రీశ్రీశ్రీ ప్రసన్న గణపతి ఆలయం అంటే తనకెంతో ఇష్టమని,ఇక్కడ స్వామివారికి పూజలు నిర్వహించి స్వాములతో పాటు తాము అల్పాహారం సేవించడం ద్వారా శ్రీశ్రీశ్రీ ప్రసన్న గణపతి ఆశీస్సులు మెండుగా ఉంటాయనే నమ్మకం సంపూర్ణంగా కలదని ఆయన అన్నారు.

# హౌసింగ్ బకాయి బిల్లుల విడుదలకై 10న ధర్నా

* పీఎం జన్మన్ బకాయి బిల్లులు మంజూరు చేయాలని మండల తహసిల్దార్ కార్యాలయంలో జరిగే ధర్నాకు జయప్రదం చేయాలి.
* గిరిజన సంఘం నాయకులు పిలుపు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 03.**హౌసింగ్ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని మండల తహసీల్దార్ కార్యాలయంలో ధర్నాకు 23 పంచాయితీ గృహ లబ్ధిదారులు ఈ నెల 10న తరలిరావాలని మండల గిరిజన సంఘం అధ్యక్షుడు ఏం ఏం శ్రీను, గిరిజన సంఘం నాయకులు అన్నారు. సోమవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల ఆదివాసీ గిరిజన సంఘం ముఖ్య నాయకులతో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను అధ్యక్షతన పి ఏం జన్మన్ బకాయి బిల్లులు పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మానపడల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం జన్మన్ హౌసింగ్ లబ్ధిదారులు బకాయిలు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జనరల్ గృహాలు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర కూటమి ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అనంతరం ముంచంగిపుట్టు గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య మాట్లాడుతూ.. రెండు నెలలు పాటు పీఎం జన్మన్ హౌసింగ్ బిల్లులు జమ కాకపోవడంతో గృహ లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇల్లులు తీసేసి షెడ్ లు ఏర్పాటు చేసుకొని అప్పులు పాలైన్నారని అన్నారు. ఇటివల కురుస్తున్న వర్షాలకు గృహాలులేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే హౌసింగ్ బకాయి బిల్లులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పీఎం జన్మన్ నుండి రోడ్లు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. 10 తేదీన మండల తహసిల్దార్ కార్యాలయంలో జరిగే ధర్నా కార్యక్రమానికి పిఎం జన్మన్ ఇల్లులా బిల్లులు బకాయిపడ్డ లబ్ధిదారులు హాజరవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాద్, ఆదివాసీ గిరిజన సంఘం పెదబయలు మండల కార్యదర్శి బి గంగాధరం, మండల నాయకులు పి రాందాస్, కె డోమ్రు, జీన్నబందు, నీలకంఠం, బుజ్జిబాబు, దేవన్న, కె కొండయ్య, సిద్దేశ్వరావు, గోపాల్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిరసిస్తూ మేడూరు గ్రామంలో కోటి సంతకాల సేకరణ



**కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.**
**వైసీపీ మండల అధ్యక్షుడు గణబాబు, ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య.**

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 3:-** చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీ మేడూరు గ్రామంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా
వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలో విజయవంతంగా నిర్వహించబడుతుందని వైసిపి మండల అధ్యక్షుడు పాంగి గణబాబు అన్నారు. వైసిపి అధినేత, మాజీ ముఖ్య మంత్రి వై.యస్ జగన్ మెహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షుడు, పాడేరు నియోజకవర్గ శాసన సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనల
మేరకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వైస్ సర్పంచ్ కొర్రా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటికరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ లో భాగంగా సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు వైసీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదల కోసం వైసీపీ ప్రభుత్వం వైద్య కళాశాలలు కట్టిస్తే నేడు కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేందుకు ఆలోచన చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.
లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్ టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్, గొందిపాకల ఎంపీటీసీ సభ్యుడు టి మోహన్ రావు, లోతు గడ్డ మాజీ సర్పంచ్ మర్రి బాబురావు, వార్డు సభ్యులు ఎస్, బాలన్న, కే,లక్ష్మణరావు, చింతపల్లి మండల రైతు విభాగం అధ్యక్షులు రాంబాబు, విద్యార్థి విభాగం అధ్యక్షులు పి.యోసేపు, సోషల్ మీడియ విభాగం అధ్యక్షులు, పి వీరన్నపడాల్, లోతుగెడ్డ పంచాయితీ యువజన విభాగం అధ్యక్షులు. కే రాజుబాబు, సోషల్ మీడియా అధ్యక్షులు కే సతీష్ శ్రీరాములు, పి.సత్యనారాయణ పడాల్, కే.వినోద్, వి, రాజు బాబు. కే .అప్పారావు. జీ . రాజబాబు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేస్తే ప్రజలకు తీవ్ర నష్టం

* జర్జుల ఏనుగు రాయి పంచాయతీలలో వైసీపీ నేతలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం.
* వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు ఎంపీటీసీ ఎం సుబ్బలక్ష్మి.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 03.**
మండలంలోని జర్జుల, ఏనుగురాయి పంచాయతీల పరిధిలో గల జంగంసరియ, అంబపడ, పెద్దతమ్మింగుల, బొదిలీగూడ గ్రామాలలో మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, సుజనకోట ఎంపిటిసి మజ్జి సుబ్బలక్ష్మిల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ,రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆయా గ్రామ ప్రజలు యొక్క అభిప్రాయాలు అడిగి తెలుసుకొని వారి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో వారు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే ప్రతిదీ డబ్బుతో ముడిపడే పనులు జరుతాయని, ప్రభుత్వం అధీనంలో ఉంటే ఉచితంగా వైద్యం అందుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోగాడైతి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొర్ర లోకినాథ్, బూత్ కమిటీ అధ్యక్షులు పాంగి చందర్ రావు, పెసా కమిటీ ఉపాధ్యక్షులు కిల్లో కృష్ణరావు, పిసా కమిటీ సభ్యులు కె బలరాం, మోహన్ రావు, బొల్లి బాబు కార్యకర్తలు ఆయా గ్రామాల ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# బౌడ గ్రామంలోని కార్తీక సోమవారం పూజా కార్యక్రమాం.



బౌడేశ్వర దేవాలయంలో పోటెత్తిన భక్తులు.



**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 3 :-** కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రాంతంలోని గౌడ గ్రామంలో కొలువైయున్న బౌడేశ్వర దేవాలయం కు భక్తులు పోటెత్తారు. చింతపల్లి పోలీసుల పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో ఆలయం వద్ద భక్తులు ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ బౌడేశ్వర క్షేత్రంలో పూజా కార్యక్రమాలతో పాటు, ప్రశాంతత లభిస్తుందనే సదుద్దేశంతో ఈ ఆలయానికి అధిక సంఖ్యలో రావడం జరుగుతుందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ వి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చింతపల్లి, జికే వీధి మండలాలకు సంబంధించిన భక్తులే గాక విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం, విజయనగరం ప్రాంతాలతో పాటు చింతపల్లి, జీకే వీధి మండలాల పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులందరికీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించి స్థానికులు స్వామివారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

# నర్సీపట్నంలో వివాదస్పదమైన సీనరేజ్ వసూళ్ళు

* చెక్ పోస్ట్ లు పెట్టి మరీ వసూలు
* జీపులో తిరుగుతూ ఎక్కడపడితే దౌర్జన్యం
* జెరాక్స్ రశీదులు ఇస్తున్న కాంట్రాక్టర్ ప్రతినిధులు



**నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 03) :**మైనింగ్ సీనరేజీ వసూలు వ్యవహారం నర్సీపట్నంలో రోజురోజుకీ ముదురుతుంది. మైనింగ్ సీనరేజీ వసూళ్ళ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన విషయం తెలిసిందే. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి ఏ ఎం ఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే ప్రైవేటు సంస్థ జిల్లా పరిధిలోని సీనరేజీ వసూలుకు అనుమతులు పొందింది. అయితే ఆ కాంట్రాక్ట్ పొందిన సంస్థ సరైన బిల్లులు ఇవ్వడం లేదని, అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారి తిరిగే లారీలు, ట్రాక్టర్లకు ముందుగానే ట్రాక్టర్కు 400 రూపాయలు, లారీకి 3000 రూపాయలు డబ్బులు తీసుకుని జిరాక్స్ కాపీలు చేతిలో పెడుతున్నారని ఆరోపించారు. ఆ పేపర్లపై కనీసం కంపెనీ పేరు గానీ, స్టాంపింగ్ గానీ లేదన్నారు. ఎక్కడైనా వాహనం కనబడితే పెన్నుతో వాహనం నెంబర్ వేసి, తేదీ, సమయము వేసి డ్రైవర్ చేతిలో పెడుతున్నారని వివరించారు. ఈ సంస్థ తరుపున అడ్డగోలుగా వసూలు చేస్తున్న డబ్బు ఎటు పోతుందో తెలియడం లేదంటూ వాహన యజమానులు, డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ నర్సీపట్నం నియోజకవర్గంలోని కొన్ని లక్షల రూపాయలు వసూలుచేస్తున్నారు. ఈ ప్రైవేట్ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లకు పాల్పడుతున్నారని సోమవారం స్పందనలో ఆర్డీవో వి.వి.రమణకు పిర్యాదు చేశారు. గ్రానైట్, నల్లరాయి, క్రషర్ బుగ్గి వంటి వాహనాలకు వేబిల్లు లేకపోతేనే సీనరేజ్ వసూలు చేయాలి, అది కూడా ఆన్లైన్లో చెల్లించాలి. కానీ సీనరేజ్ వసూలు చేసే కాంట్రాక్టర్ కు చెందిన వ్యక్తులు క్వారీలకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వే బిళ్ళు ఉన్నా, లేకపోయినా నగదు రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తున్న వారిని ఇదేమిటని ప్రశ్నించగా, వారు దౌర్జన్యానికి పాల్పడ్డారని, తిరిగి మాపైనే రోలుగుంట పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారన్నారు. దీనిపైన స్పందించవలసిన మైనింగ్ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి తాము వ్యతిరేఖం కాదని, అసలు ఎంత వసూలు చేయాలి అనే తెలిపే బోర్డులు వారి ఆఫీసుల వద్ద ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. వసూళ్ళు చేసే వ్యక్తులకు గుర్తింపు కార్డులు ఉండాలని, ఆన్లైన్ పేమెంట్లు జరగాలన్నారు. ఈ డిమాండ్లపై స్పందించాల్సిన కాంట్రాక్టర్ తన పవర్ చూపించే పనిలో ఉన్నారు తప్పా, సమస్యను పరిష్కారం దిశగా ఆలోచించడంలేదన్నారు. దీంతో ఈ వివాదం చిలికి, చిలికి గాలి వానలా మారనుంది. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ట్రాక్టర్ల యజమానులు హెచ్చరించారు.

# కడియపుసావరం గ్రామంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ





**రాజమహేంద్రవరం, పెన్ పవర్,నవంబర్ 3 :**రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కడియం మండలంలోని కడియపుసావరం గ్రామంలో సోమవారం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు అధ్యక్షతన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు.జిల్లా అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, పేదవాడు ఉచితంగా చదువుకోడానికి చంద్రబాబు ప్రభుత్వం అడ్డంకులు వేస్తుందన్నారు. పేద ప్రజలు ఉన్నత విద్య అభ్యసించాలని జగన్మోహన్ రెడ్డి నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే దిశగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకు%శీ%దన్నారు .రాష్ట్రంలో ఇప్పటికే ఆరోగ్యశ్రీ ఎత్తివేసి పేదవాడి నడ్డి విరిచారని , ప్రభుత్వం మెడికల్ కాలేజీలు కూడా ప్రైవేట్ పరం చేసి శాశ్వతంగా పేదవాడిని అనగదొక్కాలని చూస్తున్నారని అన్నారు.ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కార్యదర్శులు నక్క నగేష్,గిరిజాల బాబు,మండల అధ్యక్షులు యాదాల స్టాలిన్,సాపిరెడ్డి కామేష్,పోరాటి శ్రీను,కొత్తపల్లి శివాజీ,ఉట్టికూటి శైలజ, గంగారామ్,చింతపర్తి రాంబాబు,చాప రాజా,ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, డాక్టర్ చోల్లంగి సత్యగిరి,ఓడూరి రాంకీ,పరిమళ నాని, అరిగేల హరీష్,కట్టా జమిందర్,పితాని హరికృష్ణ,టికి శ్రీను,కోల్లి వెంకటరత్నం,పట్టా ఉత్రేజ్, కోల్లి నానీబాబు,తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలోనే మొట్టమొదటి ఖరీఫ్ సీజన్ కొనుగోలు కేంద్రం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రారంభం..





- కౌలు రైతులకు నూరు శాతం సబ్సిడీపై 50వేల తార్పలిన్లు ఉచితంగా అందజేస్తాం..
- కౌలు రైతును ఆదుకునేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నాం..
- ధాన్యం మిల్లుల తరలింపుకు 36 వేల వాహనాలను ఏర్పాటు
- ధాన్యం కనుగోలు చేసిన 24 గంటల లోపుగా నగదు జమ చేయడానికి చర్యలు తీసుకున్నాం.
- ఇన్పుట్ సబ్సిడీకి, ధాన్యం కొనుగోలుకు సంబంధం లేదు...
- అభివృద్ధి, సంక్షేమం రెండు జరగాల్సిందే.. పల్లె పండగ పేరుతో 34 వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించుకున్నాం...

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్, నవంబర్ 3.**
గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాందేడ్ల మనోహర్ వెల్లడించారు
సోమవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులను నూటికి నూరు శాతం ఆదుకుంటామని ఎవరు అధైర్య పడవద్దు అన్నారు. గత రబీ సేవలను సీజన్లో కూడా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసి నిర్ణీత గడువు కంటే ముందుగానే ధాన్యం నగదును జమ చేయడం జరిగింది అన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు కూడా కోట్లాది రూపాయలను రైతులకు బకాయిలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టిందని, కూటమి ప్రభుత్వం రాగానే రూ.1,674 కోట్లాది రూపాయల బకాయిలను రైతులకు జమ చేయడం జరిగిందని, అలాగే రూ.400 కోట్ల రూపాయలు బకాయిలను మిల్లర్లకు చెల్లించడం జరిగిందన్నారు. కౌలు రైతులు ఎక్కువమంది ఉన్నారని వారు నష్టపోకుండా ఏ విధంగా ఆదుకోవాలనేది ఆలోచన చేస్తున్నామని, తప్పకుండా కౌలు రైతులను ఆదుకుంటామన్నారు. కౌలు రైతులకు నూరు శాతం సబ్సిడీపై 50 వేల తార్పాలిన్లను ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అవసరమైన గన్ని బ్యాగులను సిద్ధం చేయడం జరిగిందని, ఎక్కడ గన్ని బ్యాగులు కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించేందుకు 34 వేల వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం రేషన్ పంపిణీకి 9 వేల వాహనాలను రూ.1,600 కోట్ల రూపాయలతో కొనుగోలు చేసి నిత్యవసర వస్తువుల సరఫరాని ఇంటి వద్దకే అనేది చేయడంలో విఫలమైందని, నేడు రాష్ట్ర వ్యాప్తంగా 29,750 రేషన్ షాపులను తెరిచి లబ్ధిదారులు ఏ సమయంలోనైనా రేషన్ పొందేందుకు అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఏమి చేస్తున్నారు. రానున్న రోజుల్లో గిరిజన సొసైటీల ద్వారా, ఆర్గానిక్ ఉత్పత్తులు పండించే రైతుల ద్వారా రేషన్ దుకాణాలకు అవసరమైన సరుకుని లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి ప్రజా సమస్యల పైన ప్రజలు కోరుకుంటున్న అంశాల పైన నిర్భయంగా పోరాటం చేసే వ్యక్తి మన బొలిశెట్టి శ్రీనివాస్ అని కొనియాడారు. ఈరోజున 12 వేల సిబ్బందితో 34 వేల ట్రాక్టర్లు లారీలు తో దాదాపు నాలుగు వేల రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. భారతదేశంలోనే మొట్ట మొదటిసారి వాట్సాప్ ద్వారానే మీరు కోరుకొన్న మిల్లుకు, నచ్చిన తేదీల్లో దాన్ని అమ్ముకునేందుకు సాంకేతికతను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుతుందని అందరూ సహకరించాలని ఇంత భారీగా జరుగుతున్న ఈ ప్రక్రియలో చిన్న చిన్న ఉంటాయి దయచేసి క్షేత్రస్థాయిలోని అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలన్నారు.
జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు ఏ విధమైన జాప్యం లేకుండానే 24 గంటల్లోనే వారికి డబ్బు జమ కావడం జరుగుతుందని రైతుల తరపున నేను ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను అన్నారు. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును నిర్ణయించడం జరిగిందని, అంచనాలకు మించి దానం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే దాన్ని కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.
తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వెంటనే ధాన్యం జమ చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైంది అన్నారు. గతంలో ఆరుగలం పండించిన రైతు దాన్ని అమ్మిన డబ్బులు ఎప్పుడు వస్తాయో అని ఎదురుచూసే పరిస్థితి ఉండేదని నేడు అది లేదన్నారు. తాడేపల్లిగూడెంలో రహదారులు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి. రహదారుల సమస్యను పరిష్కరించాలని సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ విసి అండ్ ఎండి ఢిల్లీ రావు, డైరెక్టర్ ఆర్.గోవిందరావు, చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, సిరి బాలరాజు, సొంగ రోషన్ కుమార్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జెఎస్పి జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, బిల్డింగ్ అసోసియేషన్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, ఆరుగొలను సర్పంచ్ పి బుచ్చిబాబు, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, అగ్రికల్చర్ జెడి జెడ్ వెంకటేశ్వరరావు, డీఎస్ఓ సరోజ, డి సి ఓ ఎస్ మురళీకృష్ణ, ఏడిఏ ఆర్ గంగాధర్ రావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## ప్రజోపయోగకర కార్యక్రమాలు చేపట్టే వ్యక్తి ముసిరెడ్డి నాగేశ్వరరావు- ఎమ్మెల్యే నెహ్రూ





**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 3:** ప్రజోపయోగకర కార్యక్రమాలు చేపట్టే వ్యక్తి ముసిరెడ్డి నాగేశ్వరరావు అని అదే లీడర్ లక్షణమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాట్రావులపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. ముందుగా షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం నిర్వహించడానికి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అన్నదానానికి షెడ్డు, భక్తులకు మరుగుదొడ్లు నిర్మించారు. అనంతరం పి4 పథకంలో క్యాన్సర్ బారిన పడిన అనాథ దంపతులకు నిర్మించి ఇచ్చారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా కనకదుర్గ ఆలయానికి స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కాట్రావులపల్లి గ్రామం నన్ను ఎప్పుడు ఎంతో అభిమానిస్తూ ఉంటుందని ఈ గ్రామానికి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రధానంగా నాగేశ్వరరావు చెప్పినటువంటి శ్రామిక నగర్ కాలనీకి సిమెంట్ రోడ్డులు, కాట్రావులపల్లి మెయిన్ రోడ్డు సిమెంట్ రోడ్డు రామేశ్వరంపేట వరకు తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. కాట్రావులపల్లిలో మంచినీటి ఎద్దడిని తీర్చి గోదావరి నీళ్లు తీసుకొచ్చి ప్రతి ఒక్కరికి శుద్ధి చేసిన మంచినీరు సంవత్సరం తిరిగేసరికి అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.
ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణి బాబు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, బిక్కిన బాబి, పిలా మహేష్, పోలినాటి ధర్మానందకుమారి, ఎల్లాటి అమ్మాజీ, కాట్రావులపల్లి గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 3:**రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి మండలం కురుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలన్నారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని హితవుపలికారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది అన్నారు. అంతేగాక రైతులు కావలసిన గోనె సంచులు వంటివి సరఫరా చేస్తారన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో పండిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సదుద్దేశంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్ పర్సన్ ఎలమాటి భాస్కరరావు, కొయ్యలమూడి సుధారాణి చిన్నబాబు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పీఠానికి విగ్రహాలు బహుకరణ.



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 03:**ఆలమూరు మండలం చెముడులంక శివారు గాంధీనగరం అయ్యప్ప స్వామి పీఠం ద్వారా పూజలు నిర్వహించడానికి కావలసిన వినాయక స్వామి, సుబ్రమణ్యం స్వామి, అమ్మవార్ల విగ్రహాలను బహుకరించారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన కర్రి వర్మ స్వామి,పడాల వరబాబు స్వామి, పామర్తి వీర్రాజు స్వాములు ఈ విగ్రహాలను బహుకరించారు. రావులపాలెం నుండి గాంధీనగరం వరకూ గ్రామోత్సవం నిర్వహించి అయ్యప్ప స్వామి పీఠంకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప గురుస్వాములు గారపాటి శివన్నారాయణ గురుస్వామి,దూలం శ్రీనివాస్ గురు స్వామి,బోణం లక్ష్మణరావు గురుస్వామి, కూసి శ్రీనివాస్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపరిశ్రమల స్థాపనకు తోడ్పాటు అందిస్తాం.






## ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 03:**స్థానికంగా లభ్యమయ్యే వనరులను సద్వినియోగం చేసుకుని చిన్న పరిశ్రమల స్థాపనపై యువత, మహిళలు దృష్టి సారించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మండలంలోని చెముడులంకలో నిర్వహించిన (ఎంఎస్ఎంఈ) అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల మొంథా తుఫాను సహాయక చర్యల్లో విశేష సేవలందించినందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న ఎమ్మెల్యే బండారును ఆలమూరు ఎంపీడీవో ఏ.రాజు ఆధ్వర్యంలో అధికారులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయరంగంతో పాటు గ్రామీణ యువత, మహిళలు పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కొబ్బరి, అరటి వంటి పంటల ఉప ఉత్పత్తులతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ముడిసరుకు సమృద్ధిగా లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను విస్తృతంగా ప్రోత్సహిస్తుందని చెప్పారు. గతంలో మహిళలకు పరిశ్రమల స్థాపనలో అవకాశాలు తక్కువగా ఉన్నా,ఇప్పుడు మగవారికన్నా అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ విజేతగా నిలవడం ఇందుకు నిదర్శనమని అన్నారు. డ్వాక్రా గ్రూపులతో పాటు మహిళలు చిన్నపరిశ్రమల స్థాపనపై కూడా ఆలోచించాలని సూచించారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు స్వయం ఉపాధి పథకాలు దోహదం చేస్తాయని తెలిపారు. సొంత స్థలాలు ఉన్నవారికి పరిశ్రమల స్థాపనకు శిక్షణ, రుణ సహాయం అందించడంతో పాటు స్థలం లేని ఔత్సాహికుల కోసం ప్రభుత్వం షెడ్లు ఏర్పాటు చేసి పరిశ్రమలకు కేటాయించే ఆలోచనలో ఉందని చెప్పారు. రావులపాలెంలో ఎంఎస్ఎంఈ అవగాహన మరియు సహకారం కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే బండారు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాయి జయచంద్ర, ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.కేశవవర్మ, ఎన్ఈపీడీఏ జోనల్ మేనేజర్ టి.శ్రీనివాసరావు, నాబార్డ్ బ్యాంక్ మేనేజర్ స్వామి నాయుడు, ఎంపీడీవో ఏ.రాజు, తహసిల్దార్ ప్రకాష్ బాబు, సొసైటీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, అయినవిల్లి సత్తిబాబు గౌడ్,పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బైయర్స్ మార్కెట్ విజయవాడ రియల్ ఎస్టేట్

**విజయవాడ, నవంబర్ 3, పెన్ పవర్:** కృష్ణా నది ఒడ్డున ప్రశాంతంగా ఉండే విజయవాడ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్యరాజధాని. ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ సెక్టార్ 2025లో విశాఖపట్నం, గుంటూరు తర్వాత మూడో స్థానంలో నిలుస్తోంది విజయవాడ. రెంటల్‌మార్కెట్‌లో హై డిమాండ్ చూపిస్తోంది. ఇళ్లు,స్థలాల ధరలు హైదరాబాద్‌తో పోలిస్తే 30–40% తక్కువ ఉంటాయి. కానీ రెంటల్స్ ఇతర నగరాలతో సమానం.పెనమలూరు వైపు 3 సంవత్సరాల్లో 65శాతం పెరుగుదలకనిపించింది. నివాసాలకు ఈ ప్రాంతం చాలా ఉత్తమంగా ఉంటుంది. కంకిపాడులో 30.8 శాతం పెరుగుదల కనిపించింది. ఇది కమర్షియల్ పెట్టుబడులకు అనుకూలం. బెంజ్ సర్కిల్, గన్నవరం, మంగళగిరి ప్రైమ్‌లొకేషన్లుగా మారాయి. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ ప్రాపర్టీలకు కేంద్రంగా ఉన్నాయి. ఉండవల్లి, తాడేపల్లిలో విల్లాలకు డిమాండ్ పెరిగింది.ప్రస్తుతం అపార్టుమెంట్లలో ఎస్ఎఫ్టీకి రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకూ అమ్ముతున్నారు. ప్రదేశాన్ని బట్టి. పెరుగుతోంది. గన్నరవం వైపు అయితే ఏడు వేల వరకూ చెబుతున్నారు. విల్లాల్లో రూ.ఎనిమిది వేల వరకూ ఎస్ఎఫ్టీ పలుకుతున్నాయి. ఏడాది పదిహేను శాతం వరకూధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కంకిపాడులో కమర్షియల్ కాబట్టి ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఎస్ఎఫ్టీ ఏడు వేల వరకూ చెబుతున్నారు.2025లో విజయవాడ రియల్ ఎస్టేట్ 'బైయర్స్ మార్కెట్'గా మారి, హై ROI (10–15%) అందిస్తోంది. అమరావతి బ్యాకప్‌తో ఇది దక్షిణ భారతదేశంలో టాప్ డెస్టినేషన్ అవుతుందని అంచనా.

## అంత కాన్ఫిడెన్స్ ఎందుకో

**విజయవాడ, నవంబర్ 3, పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా కాన్ఫిడెన్స్‌తో ఉన్నారు. కూటమితో మరికొన్నేళ్ల పాటు తమకు తిరుగులేని విజయం దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే చంద్రబాబు పార్టీ కేంద్రకార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో టీడీపీ ఇక ఎప్పుడూ ప్రతిపక్షంలో ఉండదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరికైనా ఇలాంటి ఆలోచనలు రావడం సహజం. ఆ మాత్రం కాన్ఫిడెన్స్‌ఉండటంలో తప్పులేదు. అలాగని అతి విశ్వాసానికి పోతే గెలిపించేది ప్రజలు అని గుర్తుంచుకోవాలన్నది అందరూ గమనించుకోవాలి. గత ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ కూడా వైసీపీ ముప్ఫయి ఏళ్ల పాటు అధికారంలోకానసాగుతుందని చెప్పారు. మొన్నటి ఎన్నికలలో ఏమైంది దేశంలో ఎక్కడ చూసినా... కేవలం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలే కాదు.. పొరుగున ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా అదే ధీమాతో ఉన్నారు. తెలంగాణరాష్ట్రాన్ని సాధించిన తనను ప్రజలు శాశ్వతంగా తననే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని భావించారు. పదేళ్ల తర్వాత ఫాం హౌస్ కు పరిమితం చేశారు. ఇక ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఐదు సార్లుముఖ్యమంత్రిగా గెలిచినా సరే.. చివరకు మొన్నటి ఎన్నికల్లో ఆయనను ఇంటికి పంపారు. ఇలాంటి ఉదాహరణలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండదని చంద్రబాబు అనడం నేతల్లోనూ, క్యాడర్ లోనూ ఆయన ఉత్సాహంతో పాటు జోష్ పెంచేందుకే అయినా ఎవరూ రాజకీయాల్లో అధికారంలో ఉండటం శాశ్వతంగా ఉండదని దేశంలోనే అనేక రాష్ట్రాల్లో చూసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఏర్పడినతర్వాత అంతా బాగుందని అనుకుంటే పరవాలేదు కానీ.. పూర్తిగా తమకు అనుకూలంగా ఉందని భావించడం మాత్రం చంద్రబాబు అతి విశ్వాసానికి నిదర్శనమనే చెప్పాలి. కూటమి అనేది కలిసి ఉండొచ్చు.ఉండకపోవచ్చు. అలాగే కూటమిలో ఉన్న పార్టీలపై జనాలకు మొహం మొత్తే అవకాశం కూడా ఉంది. చంద్రబాబు యాభై ఏళ్ల రాజకీయ అనుభవంతో ఆయన ఇక ప్రతిపక్షంలో ఉండదని చెప్పడాన్ని మాత్రం పార్టీ నేతలేనవ్వుకుంటున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతమని భావిస్తే అదే ఓటమికి ప్రధాన కారణమవుతుందని కూడా అనేక విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఆల్ ఈజ్ వెల్ అనుకున్న వారంతా రాజకీయాల్లో కనుమరుగైనవిషయాన్ని కూడా ఈ సందర్భంగా కొందరు గుర్తు చేస్తున్నారు.

# 95 ఏళ్ళ వయసు..

### ఏళ్లుగా దివ్యాంగులకు అన్నదానం, ఆర్థిక సాయం..

**శ్రీకాకుళం, నవంబర్ 3, పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాలోని కాశిబుగ్గ లో వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో పదిమంది దాకా దుర్మరణం చెందారు. ఇందులో చిన్న పిల్లలుకూడా ఉన్నారు.. ఇక ఈ ప్రమాదం నేపథ్యంలో రకరకాల విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎక్కడో మారుమూల కాశీబుగ్గ ప్రాంతంలో ఈ తరహా సంఘటన జరగడానికి కారణం ఏంటి? పూర్తిగా ప్రైవేటు వ్యక్తినిర్మించిన ఈ ఆలయానికి ఈ స్థాయిలో జనం ఎందుకు వచ్చారు? అనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.కార్తీక మాసం కావడంతో వెంకటేశ్వర స్వామి గుడికి భక్తులు భారీగా వచ్చారు. వాస్తవానికి ఈ ఆలయం2023 లో నిర్మాణం పూర్తయింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన 90 సంవత్సరాల హరి ముకుంద పండ ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈయనకు 50 ఎకరాల భూమి ఉంది. పది ఎకరాల్లో ఈ ఆలయాన్ని నిర్మించారు. హరి ముకుంద్ రాజ వంశానికి చెందినవాడు. ఈయన ఒకసారి తిరుమల తిరుపతి వెళ్లారు.. స్వామివారిని దర్శనం చేసుకునే క్రమంలో ఈయనకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత అతనే పది కోట్ల వ్యయంతోఆలయాన్ని నిర్మించాడు. 2023లో ఈ ఆలయం అందుబాటులోకి వచ్చింది. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్స్ ఈ గుడి గురించి రకరకాల వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో వదిలారు. దీంతో ఈ గుడిగురించి చాలామంది తెలుసుకొని.. ఈ ఆలయంలో ఉన్న వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలని వచ్చారు. పైగా కార్తీక మాసం కావడంతో భక్తులు అధికంగా వచ్చారు. ఇదే సమయంలో ఆలయంలో నిర్మించిన రెయిలింగ్‌కూలిపోయింది. దీంతో భక్తులు ఒకరి మీద ఒకరు పడి తొక్కిసలాట చోటు చేసుకుంది..ఈ ప్రమాదంలో 10 మంది దుర్మరణం చెందారు.కాశీ బుగ్గ ఆలయ ధర్మ కర్త పేరు హరి ముకుంద్ పండ వెంకటేశ్వర స్వామికి పరమభక్తుడు. ప్రతి సోమవారం అంధులు, దివ్యాంగులకు అన్నదానం చేస్తారు. ఒక్కొక్కరికి ?300 చొప్పున ఆర్థిక సాయం చేస్తారు. కొందరికి అయితే చేయడానికి ఒకసారి ఐదు నుంచి పదివేల వరకు చెక్కులు ఇస్తారు. హరిముకుంద తల్లికి దాదాపు 50 ఎకరాల వరకు భూమి ఉంది. ఇందులో కొబ్బరి, మామిడి, జీడి మామిడి తోటలు ఉన్నాయి. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో దాతృత్వ కార్యక్రమాలు చేపడుతున్నట్టు హరి ముకుంద పలుఇంటర్వ్యూలలో వెల్లడించారు. ఈ ఘటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు .. ఈ స్థాయిలో భక్తులు వస్తారని ఊహించలేదన్నారు.

# ఇంద్రప్రస్థగా న్యూఢిల్లీ...

**న్యూఢిల్లీ, నవంబర్ 3, పెన్ పవర్:**దేశ రాజధాని ఢిల్లీ పేరు మారే చాన్స్ ఉందా? ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చాలంటూ ఇప్పటికే విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. లేటెస్టుగా భారతీయ జనతా పార్టీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ ఇదే డిమాండ్ చేశారు.

దేశ రాజధాని ఢిల్లీ. వందల వేల ఏళ్ల చరిత్ర ఉన్న చారిత్రక నగరం. మనకు స్వాతంత్ర్యం రాకముందు ఢిల్లీ రాజధానిగా బ్రిటీషర్లు, అంతకుముందు మొఘల్స్, అంతకుముందు ఢిల్లీ సుల్తానేట్, ఇంకా ముందు పృధ్వీరాజ్ చౌహాన్ లాంటి రాజపుత్ర వీరులు ఢిల్లీ రాజధానిగా పరిపాలించారు. చరిత్ర పొరలను తవ్వుకుంటూ వెళితే, ఇది మహా భారత కాలానికి చేరుతుందని చెబుతారు. భారతంలో పాండవులు పరిపాలించిన ఇంద్రప్రస్థ ఇదేనని హిందువుల నమ్మకం.ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చడం ద్వారా, అది మన దేశ చారిత్రక, సాంస్కృతిక, నాగరికత మూలాలను ప్రతిబింబిస్తుందని బీజేపీ ఎంపీ ఖండేల్వాల్ చెబుతున్నారు. ఓల్డ్ ఢిల్లీ రైల్వేస్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయాల పేర్లను కూడా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. మహా భారత కాలంలో పాండవులు పరిపాలించిన ఇంద్రప్రస్థ ఇప్పటి ఢిల్లీ నగరంగా మారిందని హిందూ సంఘాలు చెబుతున్నాయి.ఢిల్లీ పేరు మార్పు డిమాండ్‌కు మద్దతుగా వాళ్లు కొన్ని రీజన్లు చెబుతున్నారు. యమునా తీరంలో ఇంద్రప్రస్థ నగరం నిర్మాణం జరిగిందని, పాండవుల కోసం దేవశిల్పి విశ్వకర్మ దీన్ని నిర్మించారని మహా భారతం చెబుతోంది. ఇక ఢిల్లీలోని పురానా ఖిల్లా ప్రాంతమే ఇంద్రప్రస్థ అని హిందుత్వ సంఘాలు అభిప్రాయ పడుతున్నాయి. ఢిల్లీ నగర మూలాలు ఇంద్రప్రస్థలో ఉన్నాయనే వాదనను వాళ్లు ముందుకు తెస్తున్నారు. ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చడం ద్వారా, దేశ చారిత్రక, సాంస్కృతిక మూలాలను కాపాడవచ్చనే వాదన వినిపిస్తున్నారు ఇప్పుడు ఢిల్లీలో బీజేపీ అధికారంలో ఉంది. అటు కేంద్రాన్ని కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పరిపాలిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చాలనే డిమాండ్‌పై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# 4న క్రమశిక్షణ కమిటీ ముందుకు ఎంపీ, ఎమ్మెల్యే

**విజయవాడ, నవంబర్ 3, పెన్ పవర్:** టీడీపీలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మధ్య వివాదం చెలరేగింది బహిరంగంగానే ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేసుకున్నారు. సై అంటే సై అంటూకయ్యానికి కాలు దువ్వారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ఎంపీ చిన్ని డబ్బులు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే కొలికపూడి చేసిన తీవ్ర ఆరోపణలు కలకలం రేపాయి.వీరిద్దరి తీరు పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈక్రమంలో వీరి వివాదం పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు చేరింది. వారిద్దరికి క్రమశిక్షణ కమిటీ నుంచి పిలుపొచ్చింది. ఈ నెల 4న క్రమశిక్షణ కమిటీ ముందుకు రావాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ కేశినేనిచిన్నిలకు ఆదేశాలు అందాయి. 4వ తేదీన ఉదయం 11 గంటలకు క్రమశిక్షణ కమిటీ ముందు హాజరుకావాలని ఎమ్మెల్యే కొలికపూడికి, అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు క్రమశిక్షణ కమిటీ ముందుకు రావాలనిఎంపీ కేశినేని చిన్నికి సమాచారం పంపింది టీడీపీ కేంద్ర కార్యాలయం. అంతేకాదు.. అనుచరులతో కాకుండా సింగిల్ గానే రావాలని సమాచారం పంపింది.గత ఎన్నికల్లో తనకు టికెట్ కేటాయించేందుకు విజయవాడ ఎంపీకేశినేని చిన్ని రూ.5కోట్లు తీసుకున్నారని ఎమ్మెల్యే కొలికపూడి సంచలన ఆరోపణలు చేశారు. వాటి బ్యాంకు స్టేట్‌మెంట్లు ఇవే అంటూ తన వాట్సప్ స్టేటస్‌లో పెట్టడం తీవ్ర కలకలం రేపింది. అంతేకాదు మరికొన్నివివాదాస్పద పోస్టులు సైతం తన స్టేటస్‌లో పెట్టారాయన.తన మీద కొలికపూడి చేసిన ఆరోపణలపై అంతే ఘాటుగా స్పందించారు ఎంపీ చిన్ని. తాను వైసీపీ నేతలతో అంటకాగే నాయకుడిని కానన్నారు. నిఖార్సైన టీడీపీనాయకుడినని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను విమర్శించే వాళ్లను తాను శత్రువుల్లానే చూస్తానన్నారు. 12 నెలల వరకు నన్ను దేవుడు అన్నాడు, ఇప్పుడు దెయ్యం అని ఎందుకంటున్నాడోకొలికపూడినే సమాధానం చెప్పాలన్నారు.కొన్నాళ్లుగా నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్ల గొడవలు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. టీడీపీలో క్రమశిక్షణ కట్టు తప్పుతోందన్న ప్రచారంపై అధినాయకత్వం మదనపడుతోంది. పార్టీలో కీలక నేతలు, పైగా పదవుల్లో ఉన్న వారు ఒకరి మీద మరొకరు తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసుకోవడం.. వీధికెక్కడంపై సీరియస్‌గా ఉంది హైకమాండ్. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదంపై పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు చంద్రబాబు.ఇక మీదట ఎవరైనా గీత దాటితే అసలు సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. కొన్నాళ్లుగా నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్ల గొడవలు పార్టీకి హెడెక్‌గా మారాయి. టీడీపీలో క్రమశిక్షణ కట్టు తప్పుతోందన్న ప్రచారంపై అధినాయకత్వం మధన పడుతోంది. పార్టీలో కీలక నేతలు పదవుల్లో ఉన్నవారు ఒకరి మీదమరొకరు తీవ్ర విమర్శలు చేసుకోవడంపై సీరియస్‌గా ఉంది హైకమాండ్. లేటెస్ట్‌గా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదంపై పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారుచంద్రబాబు.ఇక మీదట ఎవరైనా కట్టు తప్పితే అసలు సహించేది లేదని హెచ్చరించారు. పార్టీనే సుప్రీం అని..ఎవరూ కూడా పార్టీ కంటే అతీతులు కారని స్పష్టం చేశారు. తాను చేయాల్సిన ప్రయత్నం చేస్తానన్నఅప్పటికి మార్పు లేకపోతే గట్టి చర్యలకు సిద్ధమని బాబు సీరియస్ వార్నింగే ఇచ్చేశారు. అయితే ఇప్పటికే అటు కొలికపూడి..ఇటు కేశినేని చిన్ని సైలెంట్ అయిపోయారు. టీడీపీ అధిష్టానం కోరుకున్నది కూడా ఇదే. ఇంటర్నల్‌గా ఎన్ని సమస్యలు ఉన్నా రచ్చకెక్కొద్దనే చెప్పుకుంటూ వస్తోంది పార్టీ హైకమాండ్. ఒకరి కామెంట్స్‌కు మరొకరు రియాక్ట్ అవడం అంతా అయిపోయింది. ఆ తర్వాత పార్టీ పెద్దలు సీరియస్‌గా ఉన్నారన్నవార్తలతో ఆ ఇద్దరు నేతల కామ్ అయిపోయారు.అయినా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి విజయవాడ ఎంపీ వివాదాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి బాబు అప్పగించారు. వారిద్దరితో కమిటీ మాట్లాడాలని అధినాయకత్వంఆలోచనలు వారికి చెప్పాలని సూచించారు. ఇద్దరి అభిప్రాయలను తనకు ఒక లేఖ రూపంలో ఇవ్వాలన్న బాబు..లండన్ టూర్ నుంచి వచ్చిన తర్వాత ఆ ఇద్దరిని పిలిచి మాట్లాడుతానని చెప్పారట. వాళ్లిద్దరి పిలిచిమాట్లాడటం కంటే ముందే..ఇండైరెక్ట్ వార్నింగ్స్‌తోనే లైన్‌లోనే పెట్టే ప్రయత్నం చేస్తున్నారట చంద్రబాబు.అయినా తీరు మారకపోతే పిలిచి మాట్లాడి..స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వాలని భావిస్తున్నారట. అందుకే తిరువూరుపంచాయితీని స్మూత్‌గా డీల్ చేస్తున్నారని అంటున్నారు. ఉన్నఫళంగా ఏ నేత మీద ఎలాంటి యాక్షన్ తీసుకోకుండా ..చెప్పాల్సింది చెప్పి..తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట. సేమ్‌టైమ్ పార్టీలో వరుస పరిణామాలు, నేతల టంగ్ స్లిప్‌పై కూడా అలర్ట్ అయిన చంద్రబాబు..ఇక నుంచి వారంలో ఒక రోజు పార్టీ కోసం కేటాయించేందుకు రెడీ అవుతున్నారట.ఇదే విషయాన్ని లీడర్లకు చెప్పినట్లు తెలుస్తోంది. వీక్లీ వన్స్ డే మొత్తం పార్టీ కోసమే సమయం ఇస్తామని పార్టీని మరింత పటిష్టం చేయడానికి కోఆర్డినేట్ ఇంపార్టెంట్ అని చెప్పినట్లు తెలుస్తోంది. తాను ప్రతీ వారంలో ఒకరోజు మొత్తం టీడీపీ కేంద్ర కార్యాలయంలోనే ఉంటాననిచెప్పారట బాబు. లోకేశ్ కూడా పార్టీ కోసం వారంలో ఒక రోజు టైమ్ ఇస్తారని కూడా చంద్రబాబు అన్నట్లు చెబుతున్నారుపార్టీనే సుప్రీం అని.. ఎవరూ పార్టీ కంటే అతీతులు కారని స్పష్టం చేశారు. తాను చేయాల్సినప్రయత్నం చేస్తానన్న బాబు.. అప్పటికీ మార్పు లేకపోతే గట్టి చర్యలకు సిద్ధమని సీరియస్ వార్నింగే ఇచ్చేశారు.

# పోయిన చుట్టే వెతుక్కొనే పనిలో వైసీపీ



**కడప, నవంబర్ 3, పెన్ పవర్:** సొంత జిల్లాలో పట్టు కోల్పోయిన సీట్లపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు వైసీపీ అధినేత జగన్. కడప జిల్లాలో ఓడిన సీట్లలో మార్పులు స్టార్ట్ చేశారు. రాబోయే ఎన్నికలకు ఇప్పటినుంచే రంగం సిద్ధం చేస్తున్నారు.అందులో భాగంగా మైదుకూరులో జగన్ కొత్త తరహా వ్యూహం రచిస్తున్నారట. ఆ స్థానంలో తిరిగి గెలిచేందుకు తీవ్రంగా కసరత్తులు చేస్తున్న అధినేత గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. అయితే మైదుకూరునియోజకవర్గం కడప జిల్లా రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్.మైదుకూరు మొదటి నుంచి కాంగ్రెస్, ఆ తర్వాత వైసీపీకి బాగా పట్టున్న ప్రాంతం. ఇక్కడ మొన్నటి ఎన్నికల్లో మినహా..గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచినవారంతా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి కాకుండా బీసీలో యాదవ సామాజిక వర్గానికి చెందిన పుట్టా సుధాకర్ యాదవ్‌కు పట్టం కట్టారుమైదుకూరు ప్రజలు.మైదుకూరు నుంచి సుధాకర్ యాదవ్ మొదటి సారి ఎమ్మెల్యేగా గెలవడంతో అదే స్థాయి వ్యక్తిని..అదే సామాజిక వర్గం నేతను పోటీలోకి దింపాలన్న ఆలోచనలో జగన్ ఉన్నట్టు తెలుస్తోంది. కడపపార్లమెంట్‌లో ఏడు స్థానాల్లో వైసీపీ నుంచి ఒక్క స్థానంలో కూడా బీసీని నిలబెట్టలేదు. కడప మైనార్టీలకు అడ్డా కావడంతో అక్కడ మైనార్టీలకు ప్రయారిటీ ఇస్తూ వస్తున్నారు జగన్.ఇక మిగిలిన అన్ని స్థానాల్లోనూ రెడ్డిసామాజిక వర్గానికే టికెట్లు కేటాయించారు. మైదుకూరు నుంచి కూటమి తరుపున బీసీ ఎమ్మెల్యే గెలవడంతో ఆ స్థానంలో వైసీపీ నుంచి బీసీకే అవకాశం ఇచ్చే ఆలోచన చేస్తున్నారట జగన్. దీంతో జిల్లాలో బీసీలకుఅవకాశం కల్పించినట్లు అవడంతో పాటు..మైదుకూరులో టీడీపీని దెబ్బకొట్టొచ్చనే ప్లాన్‌లో ఉన్నారట వైసీపీ అధినేత.మైదుకూరు నుంచి బీసీని బరిలోకి దింపే క్రమంలో వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పేరు ప్రముఖంగావినిపిస్తోంది. రమేష్ యాదవ్ సొంత గ్రామం కూడా మైదుకూరు పరిధిలోనే ఉండటం..గత ప్రభుత్వ హయాంలో జిల్లా ప్రజలకు సుపరిచితుడు కావడం ఆయనకు కలిసి వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారట. జగన్‌కు అత్యంత సన్నిహితుడు కావడంతో పాటు జగన్ కోటరీలో కీలక నాయకుడిగా రమేష్ యాదవ్‌కు పేరుంది. ఈ క్రమంలోనే మైదుకూరుపై రమేష్ యాదవ్ కాన్సన్‌ట్రేషన్ పెరిగిందని అంటున్నారు.ఇప్పటినుంచే గ్రౌండ్‌ప్రిపరేషన్ స్టార్ట్ చేశారని సొంత పార్టీ నేతల్లో టాక్ నడుస్తోంది. మరోవైపు ప్రొద్దుటూరు రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితో రమేష్ యాదవ్‌కు పొసగడం లేదట. ఇప్పటికే పలుమార్లు జగన్ ప్రభుత్వహయాంలో ఇద్దరి నేతల పంచాయితీ హైకమాండ్ దృష్టికి చేరింది. రాచమల్లు, రమేష్ యాదవ్ మధ్య ఆ గ్యాప్ ఇంకా సెట్ కానట్లు తెలుస్తోంది.ఇదే సమయంలో మైదుకూరుపై దృష్టి పెట్టిన జగన్..పుట్టా సుధాకర్‌యాదవ్‌కు పోటీగా రమేష్ యాదవ్‌ను బరిలోకి దింపితే సరైన పోటీ ఉంటుందని భావిస్తున్నారట. ఇలా ప్రొద్దుటూరులో అంతర్గత పోరుకు చెక్ పెట్టడంతో పాటు మైదుకూరులో బీసీ వర్సెస్ బీసీగా రాజకీయంచేయొచ్చన్నది జగన్ ప్లాన్ అంటున్నారు. రమేష్ యాదవ్‌కు కడప ఎంపీ అవినాష్ ఆశీసులు కూడా ఉండడంతో ఈ టర్మ్ మైదుకూరు టికెట్ ఆయనకే దక్కబోతోందన్న ప్రచారం ఊపందుకుంది. మైదుకూరు బరిలో రమేష్ యాదవ్‌ను దింపితే రఘురామిరెడ్డిని ఎలా సంతృప్తి పరుస్తారనేది వేచి చూడాలి.

# ఫీల్డ్ విజిట్లు... సమీక్షలు

**ఏలూరు, నవంబర్ 3, పెన్ పవర్:** ప్రతిపక్షంలో ఉంటేనే విమర్శిస్తారు. ఫీల్డ్ విజిట్‌లు అంటూ హడావుడి చేస్తారు. అధికారంలోకి వచ్చేసరికి ఇవేమి ఉండవా? జనం బాధలు పవన్‌కు పట్టవా? అంటూ వైసీపీ పలుసార్లు పవన్‌ను అటాక్ చేసి తీరు ఇది. కానీమొంథా తుపాన్ సందర్భంగా సేనాని ఫీల్డ్ విజిట్లు చేశారు. రైతులను పరామర్శించారు. అలాగే ఆలయాల సందర్శన చేసి వార్తల్లో నిలిచారు. పవన్ కల్యాణ్..ఏపీ డిప్యూటీ సీఎం. అంటే సీఎం తర్వాత అంతటి పోస్ట్‌గాచెబుతుంటారు. పైగా కూటమిలో కీరోల్. అందుకు తగ్గట్లుగానే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రయారిటీ ఇస్తున్నారు. పవన్ కూడా తన శాఖల వ్యవహారాలనుచూసుకుంటూనే.. పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మొంథా తుఫాన్ విపత్తు సమయంలో ఫీల్డ్ విజిట్లు చేసి జనం దృష్టిని ఆకర్షించారు.ఓవైపు సీఎం చంద్రబాబు, మరోవైపు పవన్ గ్రౌండ్ లెవల్‌లో పర్యటించిజరిగిన నష్టంపై ఆరా తీశారు. అయితే పవన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జనం సమస్యలు అంటూ గళమెత్తి..అపోజిషన్‌లోకి వచ్చేసరికి మౌనంగా ఉండిపోతున్నారని పలుసార్లు వైసీపీ విమర్శిస్తూ ఉంటోంది. అయితేతనదెప్పుడూ జనం బాటే అని ప్రూవ్ చేస్తున్నారు పవన్. కూటమి ప్రభుత్వంలోని లోటుపాట్లపై కూడా అప్పుడప్పుడు తన వాయిస్ వినిపిస్తున్నారు.పవన్ వెండి తెరమీద పవర్ స్టార్. తమ అభిమాన నటుడిని నేరుగాచూడాలని..ఆయన మాట వినాలని కోరుకునే ఫ్యాన్స్ కోకొల్లలు. ఈ క్రమంలోనే పవన్ క్షేత్రస్థాయి పర్యటనలు పెట్టుకోవడానికి ఇష్టపడరు. ఫీల్డ్‌కు వెళ్తే జనం గుమిగూడటం..అధికారుల హడావుడి..అంతా సినిమా స్టార్‌వచ్చినట్లుగానే హంగామా ఉంటుందని గతంలో పలు గ్రౌండ్ లెవల్ విజిట్లను క్యాన్సిల్ చేసుకున్నారు.తాను జిల్లాల పర్యటనకు వెళ్తే.. సెల్ఫీలు, ఫ్యాన్స్ స్లోగన్స్‌తో ఇష్యూ సైడ్ ట్రాక్ పడుతుందని..అధికారులతో మాట్లాడిసమస్యలపై ఆరా తీసేవారు. దీంతో అటు వైసీపీకి టార్గెట్ అయిపోయారు పవన్. జనసేనాని అని చెప్పుకునే పవన్‌కు కూటమి ప్రభుత్వంలో సమస్యలు కనిపించడం లేదా అంటూ ఫ్యాన్ పార్టీ లీడర్లు విమర్శలుచేస్తున్నారు. దీంతో అటు ఫ్యాన్స్ హంగామాకు..ఇటు వైసీపీ విమర్శలకు చెక్ పెడుతూ..గ్రౌండ్ లెవల్‌లో పర్యటించారు పవన్.రాజకీయ తెరపై జనసేనానిగా పవన్ పవర్ ఫుల్ లీడర్. ఉప ముఖ్యమంత్రిగా అధికారబాధ్యతలు మోస్తూనే ఆయన జనాలతో మమేకం అవుతున్నారు. ఇలా ఆయన సినీ జీవితం ప్రజా జీవితం రెండింటినీ జాగ్రత్తగా బాలెన్స్ చేసుకుంటూ వెళ్తుంటారు. మొంథా తుఫాన్ బాధితులను పరామర్శించేందుకుపర్యటన పెట్టుకున్నారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. తనను కలిసిన ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకున్న పవన్..రైతులతో నేరుగా మాట్లాడి అండగాఉంటామని భరోసా ఇచ్చారు. పొలంలోకి దిగి పంట దెబ్బతిన్న పరిస్థితులను గమనించారు. ఈ పర్యటన మొత్తం రైతుల సాధక బాధలు వినడంతోనే సాగింది.డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయి పర్యటనలో ఎక్కువ సేపు గడపటం,నీళ్లు, బురదను లెక్క చేయకుండా పొలాల్లో తిరగడం ఆసక్తికర చర్చకు దారి తీసింది. పవన్ పర్యటన అంటే లేనిపోని హడావుడి ఉంటుందని విమర్శిస్తూ ఉంటుంది వైసీపీ. ఇప్పుడు పవన్ ఫీల్డ్ విజిట్‌పై కూడా ట్రోల్స్‌చేస్తున్నారు. కానీ సేనాని పర్యటనలో ఎక్కడా హంగామా కనిపించలేదని అంటున్నారు. తమ సమస్యలను తెలుసుకోడానికి పవన్ చూపిన చొరవ రైతులను ఆకట్టుకుందని అంటున్నారు. ఇక తిరుగు ప్రయాణంలో ఆధ్యాత్మిక పర్యటన..ఆ తర్వాత రోడ్డు పక్కన కూరగాయలు, కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునే వ్యాపారులను పవన్ పలకరించారు.ఎంత సినీ స్టార్ అయినా..పూర్తిగా పొలిటికల్ లీడర్‌గా..బాధ్యతాయుతమైన డిప్యూటీ సీఎం పోస్ట్‌లో పవన్ చూపించిన చొరవ..రైతులను ఎంతగానో ఆకట్టుకుందట. పవన్ గ్రౌండ్ లెవల్ టూర్‌పై జనసేన క్యాడర్ కూడా హ్యాపీగా ఉందట. వైసీపీ విమర్శలకు చెక్ పెట్టేలా తమ అధినేత రైతులనుపరామర్శించడం.. ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంపై హ్యాపీగా ఫీల్ అవుతున్నారట. మొత్తం మీద పవన్ ఫీల్డ్ విజిట్లు..వైసీపీ విమర్శలకు చెక్ పెట్టినట్లు అయిందన్న టాక్ అయితే వినిపిస్తోంది.

## కుల్దీప్‌ను ఇండియాకు పంపించేశారు.. ఆస్ట్రేలియాతో చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు దూరం






**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా చివరి రెండు మ్యాచ్ లకు టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడు. నవంబర్ 14 నుంచి ఇండియా- సౌతాఫ్రికా జట్ల మధ్య జరగనున్న టెస్ట్ సిరీస్ కోసం ఈ స్టార్ స్పిన్నర్ ను ఇండియా టీ20 జట్టు నుంచి రిలీజ్ చేశారు. ఇండియా ఎ, సౌతాఫ్రికా ఎ జట్ల మధ్య జరగబోయే రెండో అనధికారిక టెస్ట్ లో కుల్దీప్ ఆడనున్నాడు. రెండో టెస్ట్ నవంబర్ 6 నుంచి 9 మధ్య బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగుతుంది. సౌతాఫ్రికాతో సిరీస్ కు ముందు ఈ మ్యాచ్ ఈ లెఫ్టర్మ్ స్పిన్నర్ కు ప్రాక్టీస్ గా ఉంటుంది.

"బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సౌతాఫ్రికా ఏ తో జరిగే రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ ఆడడం కోసం.. ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 సిరీస్ నుండి కుల్దీప్ యాదవ్‌ను విడుదల చేయాలని భారత జట్టు యాజమాన్యం రిక్వెస్ట్ చేసింది. రెండవ నాలుగు రోజుల మ్యాచ్ నవంబర్ 6న ప్రారంభమవుతుంది ". అని బీసీసీఐ ఆదివారం (నవంబర్ 2) ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో కుల్దీప్ 12 వికెట్లు తీసి అద్భుతంగా రాణించాడు. కుల్దీప్ స్థానంలో ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదు. జట్టులో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్, సుందర్ ఉన్నారు. ఇరు జట్ల మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. శుక్రవారం (అక్టోబర్ 31) మెల్ బోర్న్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 ఆదివారం (నవంబర్ 2) జరిగితే ఇండియా 5 వికెట్ల తేడాతో ఘన విజయంసాధించి 1-1 తో సమం చేసింది. నవంబర్ 6 న నాలుగో టీ20, నవంబర్ 8న చివరిదైన ఐదో టీ20 జరుగుతుంది.

**ఆస్ట్రేలియాతో నాలుగు, ఐదు టీ20లకు భారత జట్టు:**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్ ), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), రింకుతోన్ సింగ్, వాషింగ్ సుందర్,

**దక్షిణాఫ్రికా 'ఎ' తో జరిగే రెండో టెస్ట్ కు భారత 'ఎ' జట్టు:**

రిషబ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్, మానవ్ సుతార్, ఖలీల్ అహ్మద్, గుర్నూర్ దే బ్రర్, అభిమన్యు ఈశ్వరన్, ప్రసిద్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, ఆకాష్ దీప్, కుల్దీప్ యాదవ్

## టీమిండియా పేసర్లకు భారీ నగదు.. రేణుక, క్రాంతి గౌడ్‌కు రూ.కోటి నజరానా







**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికాపై విజయం సాధించి తొలిసారి వరల్డ్ కప్ టైటిల్ సొంతం చేసుకున్న టీమిండియా తమ కలను సాకారం చేసుకుంది. వరల్డ్ కప్ జట్టులో భాగమైన టీమిండియా ఫాస్ట్ బౌలర్లు రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్ లకు తమ రాష్ట్ర ప్రభుత్వాలు భారీ నజరానా ప్రకటించాయి. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సోమవారం (నవంబర్ 3) సిమ్లా జిల్లాకు చెందిన మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేత రేణుకా సింగ్ ఠాకూర్ కు కోటి రూపాయల నగదు బహుమతిని ప్రకటించారు. వరల్డ్ కప్ ఫైనల్లో రేణుక పొదుపుగా బౌలింగ్ చేసింది. వికెట్ తీయకున్నా 8 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చింది.

ఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ రేణుకతో ఎనిమిది నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడి ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి మ్యాచ్ మొత్తం చూశానని ఆయన తెలిపారు. "హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తరపున మీకు కోటి రూపాయల నగదు పురస్కారాన్ని ఇవ్వాలని మేము నిర్ణయించుకున్నాము. మీరు వివిధ క్రికెట్ సంఘాల నుండి అనేక గౌరవాలను అందుకుంటారు. కానీ ఈ బహుమతిని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది". అని ఆయన అన్నారు.

భారత మహిళా క్రికెట్ ఫాస్ట్ బౌలర్ క్రాంతి గౌడ్‌కు సైతం ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది.

ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ ఛతర్‌పూర్ స్టార్ బౌలర్ క్రాంతి గౌడ్‌కు రూ. కోటి రూపాయలను ప్రకటించారు. వరల్డ్ కప్ లో క్రాంతి అత్యుత్తమ ప్రదర్శనకు గాను ఇండియా తొలి వరల్డ్ కప్ గెలవడంతో ఆమె చేసిన కృషికి ఈ నగదు దక్కింది. "మధ్యప్రదేశ్ కుమార్తె దేశానికి గౌరవం తెచ్చిపెట్టడమే కాకుండా లక్షలాది మంది బాలికలకు స్ఫూర్తి దీపాన్ని వెలిగించింది" అని ముఖ్యమంత్రి సోషల్ మీడియాలో క్రాంతిని హృదయపూర్వకంగా అభినందించారు. ఫైనల్లో 3 ఓవర్లు బౌలింగ్ చేసిన క్రాంతి కౌడ్ 16 పరుగులు ఇచ్చింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే ఆదివారం (నవంబర్ 2) ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో సౌతాఫ్రికాపై ఇండియా 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి వరల్డ్ కప్ టైటిల్ గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. షెఫాలీ 87 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ వీరోచిత సెంచరీతో పోరాడినా ఫలితం లేకపోయింది. షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్ రౌండ్ షోతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. షెఫాలీ వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. దీప్తి శర్మకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి.

## 21 మ్యాచ్‌ల్లో డకౌట్ అన్నావు కదా..ఇప్పుడిలా చేశావేంటి..? శాంసన్‌కు హ్యాండ్ ఇచ్చిన గంభీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఓపెనర్, వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ టీ20ల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడనుకుంటే మరోసారి బిగ్ షాక్ తగిలింది. ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా తొలి రెండు టీ20 మ్యాచ్ లాడిన సంజు.. మూడో టీ20లో బెంచ్ కు పరిమితమయ్యాడు. శాంసన్ స్థానంలో జితేష్ శర్మకు అవకాశం దక్కింది. తొలి టీ20లో బ్యాటింగ్ ఆడే అవకాశం శాంసన్ కు రాలేదు. రెండో టీ20లో వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. దీంతో శాంసన్ ను తుది జట్టు నుంచి తప్పించారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ శాంసన్ కు ఇచ్చిన భరోసా ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఆసియా కప్ ముందు సంజు శాంసన్ మాట్లాడుతూ ఇలా అన్నాడు.. "ఒకసారి గంభీర్ నా దగ్గరకు వచ్చి ఏమైంది అని అడిగాడు. దానికి నేను నాకు వచ్చిన అవకాశాలను పెద్ద స్కోర్లుగా మలచలేకపోతున్నాను అని గంభీర్ కు చెప్పాను. దానికి గంభీర్ నువ్వు వరుసగా 21 మ్యాచ్ ల్లో డకౌట్ అయినా జట్టు నుంచి తీసేయను అని సమాధానమిచ్చాడు. ఆ మాటలకు నాకు చాలా సంతోషాన్నిచ్చాయి. జట్టులో నా స్థానం సేఫ్ అని గుర్తించా. ఆ తర్వాత నుంచి గంభీర్ చెప్పిన మాటలతో నేను భారీ స్కోర్ చేయగలిగాను". అని శాంసన్ చెప్పాడు. అయితే ఒక్క మ్యాచ్ విఫలం కాగానే శాంసన్ ను పక్కన పెట్టడంతో గంభీర్ హ్యాండ్ ఇచ్చాడనే విమర్శలు వస్తున్నాయి. ఓపెనర్ గా అద్భుతంగా రాణిస్తున్న శాంసన్ ను గిల్ రాకతో ఆసియా కప్ లో మిడిల్ ఆర్డర్ లో ఆడించారు. గంభీర్ టీమిండియా ప్రధాన కోచ్ గా వచ్చినప్పటి నుంచి శాంసన్ ఓ రేంజ్ లో ఆడుతున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ లో అలవోకగా సెంచరీలు బాదేస్తున్నాడు. ఓపెనర్ గా తన స్థానానికి ఎలాంటి ఢోకా లేదనుకున్న సమయంలో మిడిల్ ఆర్డర్ కు పంపేశారు. మిడిల్ లో ఒక ఖచ్చితమైన ఆర్డర్ లో ఆడనివ్వకుండా అతని ఏకాగ్రత చెడగొట్టారు. ఆస్ట్రేలియాతో ఒక్క మ్యాచ్ లో విఫలం కాగానే పక్కన పెట్టారు. శాంసన్ స్థానంలో జట్టులోకి వచ్చిన జితేష్ ఆస్ట్రేలియాపై మూడో టీ20లో రాణించాడు. 13 బంతుల్లోనే 22 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఆదివారం (నవంబర్ 2) హెూబర్ట్ వేదికగా బెల్లెరివ్ ఓవల్ లో జరిగిన హాయ్ స్కోరింగ్ మ్యాచ్ లో టీమిండియా 5 వికెట్ల తేడాతో విజయం సాధించి ఆతిధ్య ఆస్ట్రేలియాకు షాక్ ఇచ్చింది. భారీ ఛేజింగ్ లో వాషింగ్ టన్ సుందర్ (23 బంతుల్లో 49: 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుత క్యామియోతో పాటు మిగిలిన టీమిండియా బ్యాటర్లు తలో చేయి వేసి జట్టుకు విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేజింగ్ లో ఇండియా 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసి గెలిచింది.

# శ్రీలీల.. ఎన్ని రోజులు ఇలా





ఒక హీరోయిన్ తొలి సినిమా ఫ్లాప్ అయితే.. మళ్లీ అవకాశాలు దొరకడం కష్టమే. కానీ శ్రీలీల విషయంలో మాత్రం దీనికి భిన్నంగా జరిగింది. తెలుగులో తన తొలి సినిమా 'పెళ్లి సంద-డి' డిజాస్టర్ అయినా.. అందులో తన అందచందాలు, డ్యాన్సులు యూత్‌కు బాగా నచ్చేశాయి. దీంతో తెలుగులో శ్రీలీలకు మంచి ఛాన్సులే వచ్చాయి. అందులోనూ రెండో చిత్రం 'ధమాకా' పెద్ద హిట్టయి శ్రీలీల డ్యాన్సులకు ఇంకా మంచి పేరు రావడంతో ఆమె వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది.కెరీర్ ఆరంభంలోనే ఏకంగా మహేష్ బాబుతో 'గుంటూరు కారం'లో జట్టు కట్టే ఛాన్స్ లభించింది. అది కాక స్కంద, భగవంత్ కేసరి లాంటి క్రేజీ ప్రాజెక్టుల్లో నటించే అవకాశం అందుకుంది శ్రీలీల. కానీ 'ధమాకా' తర్వాత కథానాయికగా ఆమెకు ఒక్కటంటే ఒక్క సక్సెస్ లేదు. పైగా ఆమె పాత్రలు రొటీన్ అయిపోతుండడం.. తన నటన తేలిపోతుండడంతో శ్రీలీల కెరీర్ డోలాయమానంలో పడేలా కనిపిస్తోంది.

ఒక్క 'భగవంత్ కేసరి'లో తప్పితే శ్రీలీల పెర్ఫామెన్సుకి ఎందులోనూ ప్రశంసలు దక్కలేదు. ఆమెవి కూరలో కరివేపాకు తరహా పాత్రలుగానే ఉంటున్నాయి. హీరోతో రొమాన్స్, కామెడీ చేయడం.. పాటల్లో డ్యాన్సులేయడం.. ఇదీ వరస. మొదట్లో క్యూట్‌గా అనిపించిన తన పాత్రలు, నటన.. తర్వాత ప్రేక్షకులకు మొనాటనస్‌గా తోస్తున్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్, రాబిన్‌హుడ్, జూనియర్.. ఈ సినిమాలు వేటిలోనూ తన పాత్రకు ప్రాధాన్యం లేదు. నటన గురించి చెప్పుకోవడానికేమీ లేదు. ఆ జాబితాలోకి కొత్తగా 'మాస్ జాతర' కూడా వచ్చి చేరింది.

ఇందులో శ్రీలీల పాత్ర, నటన తేలిపోయాయి. అసలే రవితేజ మార్కు రొటీన్ మాస్ మసాలా సినిమా.. అందులో వీక్ క్యారెక్టర్ పడడంతో శ్రీలీల మినిమం ఇంపాక్ట్ కూడా వేయలేకపోయింది. కేవలం డ్యాన్సుల్లో మాత్రం ఆమె మెరిసింది. కానీ సరైన పాత్ర, పెర్ఫామెన్స్ లేకుండా ఎన్నాళ్లిలా పాటల్లో మెరుపులతో సరిపెడుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుధ కొంగర దర్శకత్వంలో రానున్న 'పరాశక్తి'లో మ్మాత్రం ఆమె కొత్తగా అనిపించే, పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్ర చేస్తన్నట్లు కనిపిస్తోంది. అదైనా ఆమె కెరీర్‌ను మారుస్తుందేమో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com